హైదరాబాద్ వార్త



# 3 పార్టీలకూ.. సవాలే!

**లోక్‌సభ ఎన్నికలకు గడువు సమీపిస్తున్న నేపథ్యంలో సికింద్రాబాద్‌పై రాజకీయ పార్టీలు సన్నద్ధమౌతున్నాయి. ఈ ఎన్నికలు మూడు ప్రధాన రాజకీయ పార్టీలకు సవాల్‌గా మారాయి. అధికార కాంగ్రెస్ పాటు ప్రతిపక్ష బిఆర్ఎస్, బిజెపిలు ఈ స్థానం కోసం తీవ్రంగా పోటీ పడుతున్నాయి.**

## ఎంపి స్థానం కైవసానికి పార్టీల వ్యూహారచన

హైదరాబాద్, జనవరి 7 ప్రభాతవార్త : ముందుగానే అభ్యర్థులను ఖరారు చేసి ప్రచారాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. ఇప్పటికే బిఆర్ఎస్, బిజెపి అగ్రనేతలు సంస్థాగతంగా కార్యకర్తలు, నాయకులతో సమావేశాలు నిర్వహించారు. అధికార కాంగ్రెస్ పార్టీ కూడా సమావేశాలు నిర్వహించేందుకు సన్నద్ధమౌతోంది. సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో అంబర్‌పేట, ముషీరాబాద్, సనత్‌నగర్, సికింద్రాబాద్, నాంపల్లి, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాలు వస్తాయి. ఇటీవల జరిగని శాసనసభ ఎన్నికల్లో నాంపల్లి నియోజకవర్గం నుండి ఎంఐఎం పార్టీ గెలుపొందగా, అంబర్‌పేట, ముషీరాబాద్, సనత్‌నగర్, సికింద్రాబాద్, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లో బిఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందారు.కాగా లోక్‌సభ పరిధిలోని ఈ శాసనసభ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ అంబర్‌పేట మినహా ఇతర ఆరు నియోజకవర్గాల్లో రెండోస్థానంలో నిలిచింది. ఇక బిజెపి ఒక్క అంబర్‌పేటలో మాత్రమే రెండోస్థానంతో సరిపెట్టుకొని, ముషీరాబాద్, సనత్‌నగర్, సికింద్రాబాద్, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్‌లో మూడోస్థానానికి పరిమితమైంది. ఈ ఫలితాలను చూస్తే లోక్‌సభ ఎన్నికల్లో ప్రధానంగా కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ మధ్యనే పోటీ ఉండబోతోందని స్పష్టమౌతోంది.

కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థి ఎవరనే విషయంలో ఇంకా స్పష్టతలేదు. శాసనసభ ఎన్నికల్లో సికింద్రాబాద్ లోక్‌సభ పరిధిలోని శాసనసభ ఎన్నికల నుండి ఒక్క స్థానం కూడా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలువలేకపోయారు. ఈ నేపథ్యంలో పోటీకి బలమైన అభ్యర్థిని దింపాలనే యోచనలో ఆపార్టీ అధిష్టానం ఉంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ కాంగ్రెస్ పార్టీగా పోటీచేసి మూడోస్థానానికి పరిమితమయ్యారు. అయితే ఈసారి తిరిగి అంజన్‌కుమార్ యాదవ్‌కు లేదా ఆయన కుమారుడు అనిల్ కుమార్‌యాదవ్‌కు కాంగ్రెస్ టికెట్ ఇస్తారనే ప్రచారం జరుగుతోంది. ఇక బిఆర్ఎస్‌లో కూడా అభ్యర్థి ఎవరనేది స్పష్టత లేకుండా పోయింది. గత లోక్‌సభ ఎన్నికల్లో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ కుమారుడు తలసాని సాయికిరణ్‌యాదవ్ పోటీ చేసి రెండోస్థానంలో నిలిచారు. ఈ లోక్‌సభ పరిధిలోని ఏడు శాసన సభ స్థానాల్లో ఆరు స్థానాల్లో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు భారీ మోజార్టీతో గెలుపొందారు. ఈసారి కూడా తనకే పార్టీ అవకాశం ఇస్తుందనే భరోసాతో తలసాని సాయికిరణ్‌యాదవ్ ఉన్నారు. లోక్‌సభ నియోజక వర్గంలోని అన్ని శాసనసభ నియోజక వర్గాల్లో బిఆర్ఎస్ నేతల మధ్య సయోధ్య ఉన్నా, సికింద్రాబాద్ శాసనసభ నియోజకవర్గంలోకి వచ్చే సరికి ఎమ్మెల్యే పద్మారావుగౌడ్, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ మధ్య విభేదాలు ఉన్నాయని కొందరు పార్టీ నాయకులు చెప్పుకుంటున్నారు. అయితే ఈసారి కూడా కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి బిజెపి నుంచి బరిలో ఉండే అవకాశాలు ఉండడంతో ఆయన్ను ఢీకొనే మరో బలమైన నేత కోసం కూడా అన్వేషణ జరుగుతున్నదని ఆపార్టీ నేతలు పేర్కొంటున్నాయి. సికింద్రాబాద్ లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి నుంచి రెండోసారి పోటీ చేసే అభ్యర్థి కేంద్ర మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి పేరు దాదాపు ఖరారైనట్లు తెలుస్తోంది. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కిషన్‌రెడ్డి బిఆర్ఎస్ పార్టీపై 68వేల పైచిలుకు మెజార్టీతో విజయం సాధించారు. జరగబోయే ఎన్నికల్లో అదే మెజార్టీని కాపాడుకోవాలని ఆపార్టీ శ్రేణులకు అగ్రనాయకత్వం దిశానిర్దేశం చేసింది.

## మెట్రో రైల్ ఫేజ్-2పై ఉన్నతాధికారుల సమావేశం



మెట్రోరైల్ అధికారులతో సమావేశమైన మెట్రోరైల్ ఎండి ఎన్‌విఎస్.రెడ్డి

హైదరాబాద్ జనవరి 7 ప్రభాతవార్త: హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2 సవరించిన రూట్ ప్రతిపాదనలపై ఎండి ఎన్‌విఎస్.రెడ్డి ఇంజనీరింగ్ నిపుణులు, సంబంధిత అధికారులతో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో నాగోల్-ఎల్‌బి.నగర్-మైలార్‌దేవ్‌పల్లి-శంషాబాద్ ఎయిర్‌పోర్టు రూట్‌పై చర్చించారు. నాగోల్-ఎల్‌బి.నగర్-మైలార్‌దేవ్‌పల్లి-ఎయిర్‌పోర్టు లైన్‌లో ఉన్న చంద్రాయణగుట్ట వరకు ఎంజిబిఎస్-ఫలక్‌నుమాను ఒకటిన్నర కి.మీ.పొడగించడంపై ఓల్డ్ ఎయిర్‌పోర్టు కనెక్టివిటి కోసం ఇంటర్‌ఛేంజ్ స్టేషన్‌గా చంద్రాయణగుట్టను అభివృద్ధి చేయడం చర్చలో ఇతర అంశాలపై అధికారులు చర్చించారు. చంద్రాయణగుట్టలో ఇరుకైన రహదారి వెడల్పు, అక్కడ ఫ్లైఓవర్ ఉనికిని దృష్టిలో ఉంచుకుని రైలు రివర్సల్, స్టేబ్లింగ్ లైన్‌ల ఏర్పాటులో ఉన్న సంక్లిష్టతలు, సాధ్యమయ్యే సాంకేతిక పరిష్కారాలపై అధికారులు చర్చించారు. దేశంలో అందుబాటులో ఉన్న ఇతర సిగ్నలింగ్ టెక్నాలజీలు, కోచ్‌ల స్వీకరణకు వ్యతిరేకంగా ఒకే విధమైన సిగ్నలింగ్, రైలు నియంత్రణ వ్యవస్థ, కోచ్‌లను అనుసరించడం వల్ల కలిగే లాభనష్టాలపై కూడా సుదీర్ఘంగా చర్చించారు. అదే విధంగా కొత్త డిపోల స్థానం, కొత్త ఆపరేషనల్ కంట్రోల్ సెంటర్లు(ఓసీసీ) మైలార్‌దేవ్‌పల్లి-ఎయిర్‌పోర్టు రోడ్‌లో కొంత విస్తీర్ణంలో 'ఎట్ గ్రేడ్' మెట్రోను ఏర్పాటు చేయడానికి సాధ్యాసాధ్యాలు మొదలైనవి సరైన పరిష్కారాలను చేరుకోవడానికి ఫేజ్-2లో ఖర్చు తగ్గింపును సాధించడానికి సిఎం రేవంత్‌రెడ్డి చెప్పారని, తక్కువ ఖర్చుతో మెట్రో నిర్మాణానికి చేపట్టాల్సిన అవసరం ఉందని అధికారులు వివరించారు.కొత్త మెట్రో స్టేషన్‌లలో తగిన పార్కింగ్ సౌకర్యాలు, చివరి మైట్రె కనెక్టివిటీ, పాదచారుల సౌకర్యాలు, ఎయిర్‌పోర్టు బర్న్ మెట్రో లగేజీ కోసం స్థలం మొదలైన వాటిని డీపీఆర్‌లను సిద్ధం చేసేటప్పుడు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను మెట్రెరైల్ ఎండి ఎన్‌విఎస్.రెడ్డి ఆదేశించారు. ఈ సమావేశంలో చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ డివిఎస్.రాజు, చీఫ్ సిగ్నల్ అండ్ టెలికాం ఇంజనీర్ ఎస్‌కె.దాస్, చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ బి.ఆనంద్‌మోహన్, జనరల్‌మేనేజర్‌లు ఎం.విష్ణు వర్దన్‌రెడ్డి, మెట్రోరైల్ నిపుణులు బిఎన్.రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## కాలాపత్తర్‌లో పండ్ల వ్యాపారి దారుణ హత్య

చార్మినార్, జనవరి 7 ప్రభాతవార్త : పాత కక్షలు కారణంగా హైదరాబాద్ పాతబస్తీలో శనివారం అర్ధ రాత్రి ఓ పండ్ల వ్యాపారి దారుణ హత్యకు గురైన సంఘటన కాలాపత్తర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.ఇన్‌స్పెక్టర్ దాలినాయుడు కథనం ప్రకారం.. దానిమ్మ గుడిసెలు ప్రాంతానికి చెందిన షేక్ అఫ్రోజ్ (45) వృత్తి రీత్యా పండ్ల ప్యావారి, ఆటో డ్రైవర్.కాగా జహనుమా ప్రాంతానికి చెందిన షేక్ మహమూద్ అలియాస్ డాబ్లా (42) ఆటో డ్రైవర్.వీరిద్దరి మధ్య గత కొంత కాలంగా పాత కక్షలు కారణంగా గొడవలు జరుగుతున్నాయి.శనివారం రాత్రి 12 గంటల సమయంలో షేక్ అఫ్రోజ్ తాడ్‌బన్ చౌరస్తా నుంచి నవాబ్ సాహెబ్‌కుంట ప్రాంతానికి వెళుతున్నాడు.అదే సమయంలో షేక్ మహమూద్ అలియాస్ డాబ్లా తన స్నేహితుడైన వసీం (22)తో కలిసి తాడ్‌బన్ చౌరస్తాకు వస్తున్నాడు.స్థానిక చెత్త కుండి రహదారిలో ఇద్దరు ఎదురయ్యారు. ఇద్దరు మధ్య వివాదం జరిగింది. కోపంలో డాబ్లా తన వద్ద ఉన్న కత్తితో పండ్ల వ్యాపారి షేక్ అఫ్రోజ్ గుండె మీద పొడిచాడు.ఈ సంఘటనలో తీవ్ర గాయాల పాలైన అఫ్రోజ్ అక్కడకక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని షేక్ అఫ్రోజ్ మృత దేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టు మార్టం కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పోస్టు మార్టం అనంతరం పోలీసులు అఫ్రోజ్ మృత దేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.పండ్ల వ్యాపారి దారుణ హత్య కేసులో పోలీసులు ఆటో డ్రైవర్ డాబ్లా, అతని స్నేహితుడైన వసీంను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ కేసును కాలాపత్తర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



సస్పెన్షన్‌కు గురైన ఇన్స్‌పెక్టర్ సతీష్ (ఫైల్ ఫోటో)

## పహాడీషరీఫ్ ఇన్స్‌పెక్టర్‌పై సస్పెన్షన్ వేటు

**భూవివాదాల్లో జోక్యం చేసుకున్నందుకు**

**సస్పెండ్ చేసిన రాచకొండ కమిషనర్**

సరూర్‌నగర్, జనవరి 7 ప్రభాతవార్త: హైదరాబాద్ నగర శివార్లలోని రాచకొండ పోలీస్ కమీషనరేట్ పరిధి కిందకు వచ్చే పహాడీషరీఫ్ ఇన్స్‌పెక్టర్‌పై సస్పెన్షన్ వేటు పడింది. సివిల్ కేసులో జోక్యం చేసుకున్నారని స్థానిక ఇన్స్‌పెక్టర్ సతీష్‌పై వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపిన రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు చర్యలు తీసుకొని సస్పెండ్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. మహేశ్వరం మండలంలోని ఓ గ్రామంలో భూ వివాదంలో ఇన్స్‌పెక్టర్ తలదూర్చినట్లు సిపికి ఫిర్యాదు అందింది. దీంతో విచారణ జరిపిన కమీషనర్ ఇన్స్‌పెక్టర్‌పై సస్పెన్షన్ వేటు వేశారు.

## భార్యతో గొడవ పడి భర్త ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న గోవిందప్ప (పాతచిత్రం)

నార్సింగి, జనవరి 7 ప్రభాతవార్త : భార్యతో గొడవ పడి మనస్థాపం చెందిన భర్త ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం కుదురుమళ్లకు చెందిన పెద్ద గోవిందప్ప బతుకుదెరువు కోసం భార్య, బిడ్డలతో కలిసి హైదరాబాద్ నగరానికి వలస వచ్చాడు. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం హైదర్షాకోట్ గ్రామంలో ఉంటూ భవన నిర్మాణాలలో మేస్త్రీగా పని చేస్తున్నాడు. ఇతడికి కూతురు, కుమారుడు సంతానం ఉన్నారు. శనివారం సాయంత్రం భార్యతో గొడవ పడి మనస్థాపం చెందిన గోవిందప్ప రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వెంటనే కుటుంబ సభ్యులు గుర్తించి అతడిని చికిత్స నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని ధృవీకరించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. విషయం తెలుసుకున్న నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## సంక్రాంతి నాట్య సంబరాలు




హైదరాబాద్, జనవరి 7 ప్రభాతవార్త : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ మయూరి నృత్యాలయ సాంస్కృతిక సేవా సంస్థ ఘనంగా నాట్య ఉత్సవాలు జరిగాయి. ఆదివారం రవీంద్రభారతిలో జరిగిన నృత్యపోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్య పోటీసులు ఆహుతులను అలరించాయి. భరతనాట్యం, కూచిపూడితో పాటు పలు నృత్యాలు ఆకట్టుకున్నారు. అనంతరం చిన్నారులకు బహుమతులను అందించారు.

# ఆకాశాన్నంటిన నిత్యావసరాలు



**కూరగాయల ధరలకు రెక్కలు**

**సామాన్యుడి నడ్డి విరుస్తున్న ధరలు**

**పెరుగుతున్న ధరలతో ప్రజల బెంబేలు**



**రోజురోజుకు నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. కొనాలంటేనే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. బియ్యం, పప్పులు, కూరగాయలు ధరలు భారీగా పెరుగు తూ సామాన్యులకు అందని ద్రాక్షల మారుతున్నాయి. కేవలం కొన్ని నెలల కిందటి పోల్చితే దాదాపు 25 నుంచి 50 శాతం పెరిగిపోయాయి. నిత్యవస వస్తువుల ధరల పెరుగుదల సామాన్యుల నెలసరి ఖర్చులపై తీవ్ర ప్రభావమే చూపుతున్నాయి. నెలసరి ఖర్చుల లెక్కలు వేసుకుంటుంటే భయాందోళనకు గురయ్యే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ధరలు ఏవైనా అందుబాటు ధరలో ఉన్నాయంటే అవి కేవలం టొమాటో, ఉల్లిగడ్డలు మాత్రమే. వాటి ధరలు కూడా ఈ మధ్యనే కాస్త తగ్గాయి. వీటితో పాటు వంట నూనే, మిర్చి ధరలు మాత్రమే కాస్తోకూస్తో అందుబాటులో ఉన్నాయి.**

హైదరాబాద్, జనవరి 7 ప్రభాతవార్త : నానాటికి పెరుతున్న నిత్యవసర ధరలతో సామాన్య ప్రజలు బెంబేలు చెందుతున్నారు. నిత్యవసర ధరలు పెరగడానికి కారణాలు ఏవైనా ప్రజలు మాత్రం ఖర్చులు భరించలేకపోతున్నారు. నిత్యవసర వస్తువుల ధరలు నియంత్రించాల్సిన అధికారులు ఎందకు స్పందించడం లేదనేది పెద్దప్రశ్న. నెల తిరిగేసరికి వచ్చే ఆదాయంతో రోజులు గడపడం కష్టతరంగా మారింది. దేనికెంత ఖర్చుపెట్టాల నేదానిపై నిర్ణయిం చుకోలేని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.



గత సంవత్సరం ధరలతో పోల్చితే ఇప్పుడు దాదాపు 25 శానికి పైగా పెరిగిపోయాయి. మరికొన్ని నిత్యవసర వస్తువుల ధరలు మాత్రం ఏకంగా 50శాతానికి పైగా పెరిగిపోయాయి. ముఖ్యంగా కందిపప్పు గత సంవత్సరం ఇదే సమయానికి రూ. 100 మాత్రమే ఉండగా ఇప్పుడు మెలురకం కందిపప్పు దాదాపు రెండు వందలకు చేరింది. మినపప్పు రూ. 150కి చేరింది. పెసరపప్పు, శనగపప్పులు కూడా దాదాపు అదే ధర పలుకుతున్నాయి. కొన్ని రోజుల కిందటి వరకు ఉల్లిగడ్డలు రూ. 60కి చేరాయి. ఇప్పుడు మేలురకం ఉల్లిగడ్డలు రూ. 40కి లభిస్తున్నాయి. చింతపండు 25శాతం పెరిగింది. బియ్యం సూపర్ ఫైన్ రకం కిలో దాదాపు రూ. 70 పలుకుతున్నాయి. తాజాగా అల్లం వెల్లుల్లి ధర అమాంతం ఆకాశాన్ని తాకుతుంది. కొన్ని రోజుల కిందటి వరకు రూ. 90 లోపే ఉన్న కిలో ధర రూ. 250కి చేరింది. కిరాణా దుకాణాల్లో కిలో రూ. 300లకు విక్రయిస్తున్నారు.

**అధికారులు స్పందనేది..** ఆకాశాన్నంటుతున్న నిత్యవసర వస్తువుల ధరలతో ప్రజలు ఆందోళన చెందుతుండగా నియంత్రించాల్సిన అధికారులు ధరల పెరుగుదలకు కారణాలను తెలుసుకొని వాటిని నియంత్రించాల్సి ఉంటుంది. ప్రధానంగా రైస్ మిల్లర్లు, వ్యాపారులు బియ్యం, పప్పులు, ఇతర నిత్యవసర వస్తువులను అక్రమంగా నిల్వచేయడం వల్ల ధరలకు రెక్కలు వస్తాయి. అంతే కాకుండా వర్షాభావ పరిస్థిలులు, ఆహార పంటల సాగు తగ్గడం లాంటి కారణాలు ఉంటాయి. వీటిని దృష్టిలో పెట్టుకొని అధికారులు రైస్‌మిల్లులు, అక్రమంగా నిలువచేసిన వ్యపారాలపై దాడులు జరిపి ధరలను నియంత్రణలోకి తెస్తారు. కొన్ని రోజుల కిందట పౌరసరఫరాల శాక మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆశాఖ అధికారులతో జరిపిన సమీక్షలో నిత్యవసర సరకుల ధరల పెరుగుదల అంశంపై చర్చించినట్లు సమాచారం. అధికారులు ధరలను ఎలా అదుపులోకి తీసుకువస్తారో వేచి చూడాల్సిందే.

## నగరంలో మరో నాలుగు డంప్ యార్డులు



హైదరాబాద్, జనవరి 7 ప్రభాతవార్త : నగరానికి నాలుగు వైపులా నాలుగు డంప్‌యార్డులు ఏర్పాటు చేయనున్నారు. నివాస ప్రాంతాలకు దూరంగా డంప్‌యార్డులు ఏర్పాటు చేయనున్నారు. డంప్ యార్డుల వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని సిఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం నగరం మొత్తం జవహర్‌నగర్‌లో ఒకే డంప్‌యార్డు ఉంది. జవహర్‌నగర్ డంప్ యార్డుకు రోజుకు 8 వేల టన్నుల చెత్త తరలిపోతోంది. డంప్‌యార్డు వల్ల వాయు కాలుష్యం, దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కాలుష్యాన్ని తగ్గించేందుకు గతంలో శంషాబాద్, మెదక్‌లో కొత్త డంప్‌యార్డు స్థలాలను గుర్తించామని అధికారులు సిఎం దృష్టికి తీసుకొచ్చారు. స్థానికులకు ఇబ్బంది కలగకుండా స్థలాలను పరిశీలించి ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. చెత్త నుంచి 15 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చని, దీని ఏర్పాటుకు అధికారులు టిఎస్ఎస్‌పిడిసిఎల్‌తో సమన్వయం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. చెత్త రీసైక్లింగ్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందన్నారు.

అలాగే మూసీ రివర్ ఫ్రంట్‌ను మొదటి దశలో 55 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించిందని సిఎం తెలిపారు. రింగ్ రోడ్డు నుంచి రింగ్‌రోడ్డు వరకు ఉన్న మొత్తం ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. మూసీ నది పరివాహక ప్రాంతంలో ప్రత్యేక డిజైన్లతో అంతర్జాతీయ స్థాయి వినోద పార్కులు, జలపాతాలు, పిల్లల నీటి క్రీడలు, వీధి వ్యాపారులు, వ్యాపార కేంద్రాలు, షాపింగ్ మాల్స్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. మూసీ నది ఒడ్డున ఉన్న చార్మినార్, గోల్కొండ, సెవెన్ టూంబ్స్, తారామతి బారాదరి వంటి చారిత్రక కట్టడాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్‌ను రూపొందించాలని సిఎం సూచించారు. ఈ రంగంలో పిపిపి మోడల్‌లో పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. కాబోయే పెట్టుబడిదారులు సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ప్రజలను ఆహ్లాదకరమైన వాతావరణంలో గడిపే సౌకర్యాన్ని కల్పించాలని సూచించారు. మూసీ పరివాహక ప్రాంతంలో చెక్‌డ్యామ్‌లు నిర్మించాలని, వాటర్ ఫౌంటెయిన్లు, జలపాతాలు ఏర్పాటు చేయాలని అధికారులను సిఎం కోరారు. ఫైవ్ స్టార్ హోటళ్ల నిర్మాణానికి కూడా ప్రభుత్వం సహకరించాలని నిర్ణయించారు.దీంతో మహా నగరానికి కొత్తఅందాలు సమకూరనున్నాయి.



బోరబండలో బిఆర్ఎస్ నాయకుడి ఇంటికి వెళ్లి అతిథ్యం స్వీకరించిన కెటిఆర్, చిత్రంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే గోపీనాథ్

## 20, 21 తేదీలలో 'ఖేల్ ఇండియా మహిళా కిక్ బాక్సింగ్ లీగ్' పోటీలు

సైఫాబాద్, జనవరి 7 ప్రభాతవార్త:బాలికల ఆత్మరక్షణ కోసం ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించిన 'ఖేల్ ఇండియా మహిళా కిక్ బాక్సింగ్ లీగ్' పోటీలను ఈ నెల 20, 21 తేదీలలో ఎల్‌బి స్టేడియంలో నిర్వహిస్తున్నామని తెలంగాణ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామాంజనేయులు, మహిపాల్ తెలిపారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ పోటీలలో 10 సంవత్సరాల నుంచి 40 సంవత్సరాలలోపు పాల్గొనవచ్చునని, ఒక్క తెలుగు రాష్ట్రాలు చెందిన వారే కాకుండా ఇతర రాష్ట్రాల వారు ఈ పోటీలలో పాల్గొనవచ్చన్నారు.





పీపుల్స్ ప్లాజా నుంచి జలవిహార్ వరకు గుజరాతీ గౌరవ్ యాత్రలో పాల్గొన్న గుజరాతీ కుటుంబ సభ్యులు

## హిందూ దేవాలయాలపై ప్రభుత్వాలు పెత్తనం మానుకోవాలి

**14న శ్రీవైష్ణవి దేవాలయం ఎదుట భారీగా ప్రదర్శన**

సైఫాబాద్, జనవరి 7 ప్రభాతవార్త: దేశవ్యాప్తంగా ఉన్న హిందూ దేవాలయాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెత్తనం చేయడం మానుకోవాలని ఏకం సనాతన్ భారత్ దళ్ డిమాండ్ చేసింది. లేని పక్షంలో దేశవాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని దళ్ హెచ్చరించింది. ఇందులో భాగంగా ఈ నెల 14వ తేదీన జమ్ములోని ఖాత్రాలోగల శ్రీవైష్ణవి దేవాలయం విముక్తి కోసం వేలాది మంది భక్తులో పెద్ద ఎత్తున ప్రదర్శన చేపడతున్నామని దళ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజీవ్‌షా, నరేంద్రచౌదరి చెప్పారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ శ్రీవైష్ణ విదేవాలయం నిర్వహిణ బాధ్యతలను తరతరాలు నిర్వహిస్తున్న కుంటుబీకులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వైష్ణవి దేవాలయం అభివృద్ధికి పాటుపడకుండా భక్తులను మోసం చేస్తున్నదని విమర్శించారు. దేశంలోని హిందూ దేవాలయాలకు వచ్చే ఆదాయాలను ప్రభుత్వాలు హిందూ దేవాలయాల అభివృద్ధికి ఖర్చుచేయకుండా, చర్చిలు, మజీద్‌ల అభివృద్ధికి, ఇతర పనులకు కేటాయిస్తున్నాయని ఆరోపించారు. ఈ మేరకు శ్రీవైష్ణవి దేవాలయం డబ్బులతో ఇఫ్తార్ పార్టీని నిర్వహించడం జరిగిందన్నారు. దశల వారిగా హిందూ దేవాలయాల పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు.

## సంప్రదాయాలను కాపాడుకోవాలి

**జీడిమెట్ల ఎస్సై హారీష్**



జీడిమెట్ల, జనవరి 7, ప్రభాతవార్త : మన తెలుగు సాంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవడం మన బాధ్యత అని జీడిమెట్ల ఎస్సై హారీష్ అన్నారు. ఆదివారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సుభాష్‌నగర్ డివిజన్ ఎస్.ఆర్.నాయక్ నగర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్సై హారీష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోటీల్లో కాలనీ మహిళలు చురుగ్గా పాల్గొని రంగులతో కూడిన ముగ్గులను వేశారు. పోటీల్లో మొదటి బహుమతి ఎ.శిరీష్, ద్వితీయ బహుమంతి కె.జ్యోతి, తృతీయ బహుమతి ఎం.కీర్తి గెలుపొందారు. పూర్ణచందర్‌గుప్తా, గోపాల్‌రెడ్డి, బొబ్బా ప్రసాద్, సదానందచారి, వెంకటేశ్వరరావు, నాగశిరోమణి, సత్యనారాయణ, శ్రీనివాస్, కిరణ్, బాబి, సురేందర్‌రెడ్డి, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మల్లిఖార్జున స్వామి కల్యాణం



**మల్లిఖార్జున స్వామి వారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఓల్డ్‌బోయిన్‌పల్లి కార్పోరేటర్ ముద్దం**

బేగంపేట జనవరి 7,ప్రభాతవార్త: ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ పరిధిలోని అస్మత్‌పేట లో యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మల్లిఖార్జున స్వామి వారి కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో కార్పోరేటర్ ముద్దం నర్సింహయాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.కళ్యాణంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముద్దం నర్సింహయాదవ్‌ను కమిటీ సభ్యులు గోపాల్‌యాదవ్ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కర్రె జంగయ్య,మక్కల నర్సింగరావు, కూతాడి దయానంద్,ఆనంద్ యాదవ్,బుర్రి యాదగిరి,గడ్డం కృష్ణ యాదవ్, కనకరాజ్ యాదవ్,పెంటయ్య పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కంటోన్మెంటు బోర్డు అభివృద్ధికి నిరంతరం కృషి



**6వ వార్డు జీ.ఎల్.యాదవ్ నగర్‌లో పార్కు అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న రామక్రిష్ణ తదితరులు**

కంటోన్మెంట్,జనవరి 7 ప్రభాతవార్త: కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని వివిధ ప్రాంతాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని బోర్డు నామినేటెడ్ సభ్యులు జె.రామక్రిష్ణ తెలిపారు. ఆదివారం 6వ వార్డులోని జీ.ఎల్.యాదవ్ నగర్ కాలనీ పార్కు స్థలం ప్రహారీగోడ నిర్మాణం పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్.కె. మాట్లాడుతూ పార్కు నిర్మాణంతో పాటు వాకింగ్ ట్రాక్, కమ్యూనిటీ హాల్, ఓపెన్ జిమ్, రోడ్డు వసతి వంతి వసౌకర్యాలు కల్పిస్తామన్నారు. అదే విధంగా బోర్డు పరిధిలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ నిధులతో కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలో బిజెపిని గెలిపిస్తే కంటోన్మెంట్ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బానుక నర్మధ మల్లికార్జున్, బాణాల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కరాటే విజేతలను అభినందన**

ఒక్కినవ స్పోర్ట్స్‌ఆఫ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే ఛాంపియన్‌షిప్ 2024లో నిర్వహించిన పోటీలను ఆయన నిర్వహించిన ప్రతిభకనబర్చిన విజేతలకు ప్రశంసపత్రాలు, మెడల్స్‌ను అందజేశారు.

## వృద్ధుడు అదృశ్యం



కంటోన్మెంట్, జనవరి 7 ప్రభాతార్త: మారేడ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధి లోని గాంధీ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న ఓ వృద్ధుడు అదృశ్యమైయ్యాడు. ఇన్‌స్పెక్టర్ తిమ్మప్ప తెలిపిన కథనం ప్రకారం వెస్ట్ మారేడ్‌పల్లి సిద్ధి వినాయక టెంపుల్ సమీపంలోని గాంధీ కాలనీలో నివాసం ఉంటున్న ఎస్.బాల్‌రాజ్ 60, అనే వృద్ధుడు గత నెల 10వ తేదీన ఇంట్లో నుంచి బయటకు వెళ్ళాడు. ఎక్కడ వెతికిన అతని అచూకీ తెలియకపోవడంతో ఆయన కూతురు ఎస్.లక్ష్మి ఆదివారం మారేడ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసును ఇన్‌స్పెక్టర్ తిమ్మప్ప ఆధ్వర్యంలో ఎస్.లక్ష్మి నారాయణ దర్యాప్తు చేస్తున్నారు.

## పనిచేస్తున్న ఇంట్లో పనిమనిషి చోరీ

బేగంపేట జనవరి 7,ప్రభాతవార్త : పనిచేస్తున్న ఇంట్లోనే చోరీకి పాల్పడిన పనిమనిషిపైన యజమాని పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటనపై బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బేగంపేటలోని ది విండర్స్ అపార్ట్‌మెంట్స్‌లో నివసించే కె.అవంతి ఇంట్లోని బీరువాలో నుంచి తరచూ నగదు మాయం అవుతుంది.దీంతో సీసీ పుటేజిని పరిశీలించారు. ఇంట్లో పనిచేస్తున్న మహిళ చోరీ చేసినట్లు వారు గుర్తించారు.అక్టోబరు 2022 నుంచి జనవరి 2023వరకు మొత్తం రూ 1.80లక్షలు చోరీ అయినట్లు యజమాని గుర్తించారు.చోరీ చేసిన పనిమనిషిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.ఆమె డబ్బు తిరిగి ఇస్తానంటూ అందరి సమక్షంలో ఒప్పందం కుదుర్చుకున్నప్పటికీ ఎన్ని రోజులైనా చెల్లించకపోవడంతో యజమాని అవంతి పోలీసులకు ఫిర్యాదు చేసింది.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఆలయానికి వెళ్లిన యువతి అదృశ్యం

బేగంపేట జనవరి 7,ప్రభాతవార్త : ఇంటి నుంచి ఆలయానికి వెళ్లి వస్తానంటూ బయటకు వెళ్లిన యువతి తిరిగి ఇంటికి చేరక పోవడంతో ఆందోళనకు గురైన తల్లి దండ్రులు యువతి ఆచూకి కోసం బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బేగంపేట మయూరి మార్గ్‌కు చెందిన బి.స్వరూపకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.వీరిలో పెద్ద కుమార్తె రంజని ప్రియ(23) కొంత కాలంగా టెలీకాలర్ గా పనిచేసి అనారోగ్యం కారణంగా పని మానేసి ఇంట్లోనే ఉంటుంది.ఈ నెల 5వ తేదీన రాత్రి గుడికి వెళ్లి వస్తానంటూ ఇంటి నుంచి బయటకు వచ్చిన రంజని ప్రియ తిరిగి ఇంటికి వెళ్లలేదు.దీంతో ఆమె ఆచూకి కోసం తమకు తెల్సిన అన్ని ప్రాంతాల్లో గాలించిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసారు.ఇటీవల కాలంలో ఒక వ్యక్తితో రంజని ప్రియ తరచూ మాట్లాడుతుండేదని,ఫిర్యాదులో పేర్కొన్నారు. అతనిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## మద్యం మత్తులో ట్రాఫిక్ పోలీసులపై యువకుల దాడి

బేగంపేట జనవరి 7,ప్రభాతవార్త : మద్యం మత్తులో ఇద్దరు యువకులు ట్రాఫిక్ పోలీసులపై దాడికి పాల్పడిన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసుల కదనం ప్రకారం. బేగంపేట ట్రాఫిక్ సబ్ ఇన్స్‌పెక్టర్ మధుబాబు, ఇతర సిబ్బంది శుక్రవారం రాత్రి గం 11ల నుంచి అర్ధరాత్రి గం 2ల వరకు బేగంపేట షాపర్స్ స్టాప్ వద్ద డ్రంక అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు.ఈ సమయంలో తలపూడి చరణ్‌కుమార్, సాయికిరణ్ అనే ఇద్దరు యువకులు మద్యం మత్తులో ద్విచక్ర వాహనంపై అటుగా వచ్చారు.వారిని ఆపిన ట్రాఫిక్ పోలీసులు బ్రీత్ ఎన్‌లైజర్ పరిక్ష నిర్వహించారు.వాహనం నడుపుతున్న చరణ్‌కుమార్‌కు 110 రీడింగ్ వచ్చింది.దీంతో వారిని పక్కకు నిలిపి ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ భూషన్ రావు ఈ ఛలానా వేస్తుండగా చరణ్ కుమార్ పరుష పదజాలంతో భూషన్ రావును దూషించాడు.అంతటితో ఆగకుండా కింద చెత్త కుప్పలో పడవేసి ఛాతిపైన కొట్టాడు. ఈ ఘటనలో ఛలానాలు వేసేందుకు ఉపయోగించే ట్యాబ్ పాడైపోయింది.భూషణ్ రావు చొక్కా చిరిగి పోయింది.నిందితులు అక్కడే కూర్చొని రాకపోకలకు ఆటంకం కలిగించారు. అక్కడే ఉన్న ఇతర సిబ్బంది అప్రమత్తమై బేగంపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.ట్రాఫిక్ ఎస్సై మధుబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

**కంటోన్మెంట్ ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు**

## మెరుగుపర్చాల్సిన బాధ్యత బోర్డుపై ఉంది

**వికాస్ మంచ్ ప్రధాన కార్యదర్శి సంకి రవిందర్ బాబు**

కంటోన్మెంట్,జనవరి 7 ప్రభాతవార్త: కంటోన్మెంట్ బోర్డు పరిధిలో నివాసం ఉంటున్న ప్రజలకు కనీస అవసరాలు తీర్చాల్సిన బాధ్యత బోర్డు పై ఉంటుందని వికాస్ మంచ్ ప్రధాన కార్యదర్శి సంకి రవిందర్ బాబు తెలిపారు. కంటోన్మెంట్ వికాస్ మంచ్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రజలు వినియోగిస్తున్న భూగర్భ జలాల బోర్ మోటర్లకు మీటర్లు బిగించి డబ్బులు వసూల్ చేయడంపై జూమ్ మీటింగ్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న కంటోన్మెంట్ బోర్డు ప్రజలకు బోరు మోటర్లకు మీటర్లు పెట్టాలన్న ప్రతిపాధనను తీవ్రంగా ఖండించారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కంటోన్మెంట్ బోర్డును జిహెచ్ఎంసీలో విలీనం చేయాలని ప్రజలు ఏక గ్రీవంగా తీర్మాణించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రభుగుప్త, ఇటుక గోపీ మాదిగ, ఫసీ, అశోక్ కుమార్, అరుణ్ యాదవ్, నరిసింగ్ రావ్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## సన్మానాలు కాదు.. సమస్యలు చెప్పండి

**ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



**ఎమ్మెల్యే బిఎల్ఆర్‌ను సన్మానిస్తున్న గొల్లముత్యాలు బావి ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు**

నాచారం, జనవరి 7 ప్రభాతవార్త: సన్మానాలు కాదు తనకు సమస్యలు చెప్పి వాటిని పరిష్కరించుకునే విదంగా వెల్ఫేర్ అసోసియేషన్ వారు ఉండాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సూచించారు. ఇటీవల భారీ మెజార్టీతో ఘనవిజయం సాధించిన ఉప్పల్ ఎమ్మెల్యే బీఎల్ఆర్‌ను నాచారం గొల్ల ముత్యాలు బావి ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించి భారి గజమాలతో ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ సందర్భంగా వెల్ఫేర్ అసోసియేషన్ వారు తమ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్య, లైబ్రరీ బిల్డింగ్‌ను, కమ్యూనిటీహాల్ నిర్మాణం, స్ట్రీట్ లైట్ల ఏర్పాటు చేయించాలని కోరారు. దీంతో పాటు స్థానికంగా గంజాయి సేవించే యువకులు ఎక్కడి నుంచో ఇక్కడికి వచ్చి గంజాయి సేవిస్తూ ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని పోలీసుల ద్వార ఈ సమస్యను పరిష్కరించేలా చూడాలని ఎమ్మెల్యేను వారు కోరారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఇ.నర్సింహ్మా యాదవ్, ప్రధాన కార్యదర్శి వై.విఠల్ యాదవ్, కోషాధికారి కైలాష్ కళ్యాణ్‌తో పాటు గౌరవ అధ్యక్షులు ఇ.మల్లేష్ యాదవ్, ఛీఫ్ సలహాదారులు వి.వెంకటేష్, ,ఉపాధ్యక్షులు ఆర్.బిక్షపతి యాదవ్ నాయకులు మేకల ముత్యం రెడ్డి, దేవుల పల్లి యాదగిరి, రామచందర్, కట్టబుచ్చన్న గౌడ్, రామకృష్ణ, అషు, అంజి, దామోదర్ రెడ్డి, శ్రావణ్ కుమార్, సాయిజన్ శేఖర్, బాలయ్యతదితరులు పాల్గొన్నారు.

### గాయకుడు పిఎన్.వెంకటేశ్వర్‌రావుకు 'హింది మెలోడి కింగ్' అవార్డు

చిక్కడపల్లి, జనవరి 7 ప్రభాతవార్త: తన గళమాధుర్యంతో అందరి నుంచి ప్రశంసలు అందుకుంటున్న గాయకులు పిఎన్.వెంకటేశ్వర్‌రావు అని రాష్ట్ర పోలీసు హౌజింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కొల్లేటి దామోదర్ అన్నారు. ఆదివారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో ఆర్ఆర్.ఫౌండేషన్ ఆధ్వర్యంలో పిఎన్.వెంకటేశ్వరరావుచే హిందీ పాటల పూదోట కార్యక్రమం ప్రేక్షక హృదయాలను ఎంతో ఆకట్టుకుంది. గత 20 సంవత్సరాల నుంచి హిందీ పాటల అలనాటి గాయకుల మేటి గీతాలతో పిఎన్.వెంకటేశ్వర్ వారి గళ మాధుర్యంతో ప్రేక్షక హృదయాలను అలరించారు.

## సాంకేతిక కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకుల డిమాండ్లను అమలు చేయాలి

**సంతోష్‌కుమార్ డిమాండ్**

సైఫాబాద్, జనవరి 7 ప్రభాతవార్త: రాష్ట్రంలోని వందలాది సాంకేతిక కళాశాలలో పనిచేస్తున్న వేలాది మంది ఉపాధ్యాయుల డిమాండ్లను యాజమాన్యాలను తక్షణమే అమలు చేయాలని, ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలని తెలంగాణ స్కూల్స్, టెక్నికల్ కాలేజెస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అయినేని సంతోష్‌కుమార్ డిమాండ్ చేశారు. లేని పక్షంలో కళాశాలల యాజమాన్యలపై పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన అసోసియేషన్ నూతన సంవత్సరం డైరీ-2024, క్యాలెండర్‌ను ఆవిష్కరించిన సందర్బంగా ఆయన మాట్లాడారు. నిబంధనల ప్రకారం ఉపాధ్యాయులకు వేతనాలు నెలవారిగా అందేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని, జీతాలు అకౌంట్లలో వేసి తిరిగి తీసుకునే యాజమాన్యాలపై కఠినంగా చర్యలు తీసుకోవాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇఎస్ఐ, పి




**క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న సంతోష్‌కుమార్**

ఎఫ్ సౌకర్యం కల్పించాలని, గ్రూప్ యాక్సిడెంట్ పాలసీని అమలు చేయాలని, మహిళా అధ్యాపకులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని , గ్రాడ్యూటి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు డి.శ్రీనివాస్, బి.అనంతరామ్, రాజుగుప్తా, రమేష్ కరుణాకర్‌రెడ్డి, రవి, శ్యామ్‌సుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## సాహిత్యవేత్తలు, రచయితలకు పూర్తి సహకారమందిస్తా

**తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్**



**తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌కు ఘనంగా సన్మానం చేస్తున్న పకాష్‌రెడ్డి, భాగయ్య, బడేసాబ్, దైవజ్ఞశర్మ, రాఘవేంద్రాచార్యులు**

రవీంద్రభారతి, జనవరి 7 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్రంలో కవులు, రచయితలు, సాహిత్యవేత్తలు ఎప్పుడు ఏవిధమైన అవసరమున్నా తనవద్దకొస్తే ప్రభుత్వపరంగానైనా లేకపోతే స్వయంగా కూడా సంపూర్ణ సహాయసహకారాలు అందిస్తానని తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ హామీనిచ్చారు. రాజ్యాంగపదవైన శాసనసభాపతిగా మొత్తం 119మంది శాసనసభ్యులు ఏకగ్రీవంగా తనను ఎంపికచేసి ఈ పదవిలో కూర్చోబెట్టినందుకు పూర్తిగా న్యాయం చేస్తానని, మంచి సభాపతిగా నిలిచిపోయేటట్టు కృషిచేస్తానని స్పష్టం చేశారు. ప్రముఖ సాంస్కృతిక, సాహిత్య సంస్థలు పెద్దయెత్తున తనకు మొట్టమొదటి సాన్మానం చేసినందుకు ఆనందాన్ని వ్యక్తపరుస్తూ కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ, గోల్కొండ సాహితీ కళాసమితి, అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక, తెలుగుభాష చైతన్య సమితి, లక్ష్యసాధన ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నుండి సాయంత్రం వరకు రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో కవిసమ్మేళనం, సాహిత్య చర్చావేదికలతోపాటు ఇటీవల తెలంగాణ శాసనసభకు సభాధిపతిగా ఏకగ్రీవంగా నియమితులైన గడ్డం ప్రసాద్ కుమార్‌కు సాహిత్య సాంస్కృతిక సంస్థల సన్మానసభ కార్యక్రమానికి విచ్చేసిన తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, విశిష్ట అతిథులు దైవజ్ఞశర్మ, సంస్థల అధిపతులు డా. అర్ధచంద్ర ప్రకాష్‌రెడ్డి, ప్రొఫెసర్ భాగయ్య, బి.రాఘవేంద్రాచార్యులు, పి.బడేసాబ్, ప్రజ్ఞారాజు తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనం చేసి కార్యక్రమాలను ప్రారంభించినాంతరం సాహిత్య సాంస్కృతిక సంస్థల అధిపతులు బడుగు బలహీనవర్గాల నుండి తెలంగాణ శాసనసభాపతిగా నియమితులైన గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఘనంగా సన్మానించి ఆయన ప్రతిభను కొనియాడారు. సభకుముందు కవిసమ్మేళనం, సభానంతరం పి.బడేసాబ్ సభాసమన్వయంలో డా. అర్ధచంద్ర ప్రకాష్‌రెడ్డి సభాధ్యక్షతన జరిగిన తెలుగు లిపిలో రాదగిన మార్పులు అనే అంశంపై మొదటి సమావేశం; గంట మనోహర్‌రెడ్డి సమన్వయంలో బి.పి.నర్సింహులుగుప్త సభాధ్యక్షతన ద్వితీయ సమావేశం ఎంతో ఆసక్తికరం అర్ధవంతంగా సాగి ఆహుతులను ఆకట్టుకొని ఆలోచింపజేశాయి.

## పెరికలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనం: ప్రొ.కోదండరాం

తార్నాక, జనవరి 7 ప్రభాతవార్త: పెరికలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనమని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొ.కోదండరాం పేర్కొన్నారు. పెరిక ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ సొసైటీ (పెప్సీ) ఆద్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ పెప్సీ ఒక సంఘంగా ఏర్పడి తమ హక్కులను సాధించుకునే దిశగా కృషి చేస్తున్నందుకు అభినందించారు. తెలంగాణ ఉద్యమంలో పెరికకులస్థులు ముఖ్యపాత్ర పోషించారని కొనియాడారు. పెప్సీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు డా. సంగని మల్లేశ్వర్ మాట్లాడుతూ జనుము పండించి దానితో ధాన్యం రవాణా బోరెలు, గోనే పట్టాలు, ధాన్యం సంచుల తయారీ చేసిన కులవృద్ధి అంతరించిపోయినందున జౌళిపరిశ్రమ ఏర్పాటులో భాగస్వామం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. బలహీన వర్గాలల్లో అత్యంత వెనకబడిన పెరికల అభివృద్ధి కోసం పెరిక కుల ఫెడరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ



**పెరిక సంఘం నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొ.కోదండరాం**

కార్యక్రమంలో పెప్సీ ప్రధాన కార్యదర్శి తిప్పని సిద్దులు, సలహాదారులు చింతం లక్ష్మినారాయణ, కోషాదికారి సతీష్‌కుమార్, జిల్లాల అధ్యక్షులు రాధా కృష్ణ, వెంటయ్య, డా. బండి శ్రీకాంత్, నాయకులు డా. సీహెచ్.రాజు, శ్రీరాం వీరయ్య, నరహరి, నాగేశ్వర్ రావు తధితరులు పాల్గొన్నారు.



**ఓల్డ్ వాసవి నగర్‌లో శ్రీరాముడి అక్షింతలు వితరణ చేస్తున్న తెలుకుంట సతీష్‌గుప్త తదితరులు**

## శ్రీరాముడి అక్షింతలు ప్రతి ఇంట్లో చేరితే శుభం కలుగుతుంది : తెలకుంట

కంటోన్మెంట్,జనవరి 7 ప్రభాతవార్త: అయోధ్య రామ మందిరం దేశ ప్రజల స్ఫూర్తి కేంద్రమని, అందు వల్ల శ్రీరాముడి అక్షింతలు ప్రతి ఇంట్లో చేరాలని సమాజిక కార్యకర్త, వాసవి నగర్ కాలనీ నేత తెలుకుంట సతీష్‌గుప్త తెలిపారు. ఆదివారం కంటోన్మెంట్ 5వ వార్డు ఓల్డ్ వాసవి నగర్‌లో గడపగడపకు అయోధ్య శ్రీరాముడి అక్షింతలు అందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం వేద పండితులు హేమంత్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వాసవి నగర్ కాలనీ ప్రతినిధులు మణిగండ్ల శ్రీనివాస్, బాలక్రిష్ణ, అజయ్, గంప సాయిప్రసాద్, ప్రొద్దుటూరి రాఖేశ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## గడప గడపకు శ్రీరాముల వారి అక్షింతలు



**గడపగడపకు శ్రీరాముల వారి అక్షింతలను పంపిణీ చేస్తున్న సీనియర్ బీజేపి నాయకులు కంజర్ల సదాశివయాదవ్**

యూసుఫ్‌గూడ, జనవరి 7, ప్రభాతవార్త : అయోధ్య రామమందిరం నుంచి వచ్చిన శ్రీరాముల వారి అక్షింతలను గడపగడపకు సనత్‌నగర్‌లోని శివాజి నగర్ ఎస్ఆర్టీ కాలనీలో అశ్విని వంశీ కృష్ణ ఆధ్వర్యంలో సీనియర్ బిజేపి నాయకులు కంజర్ల సదాశివ యాదవ్ పాల్గొని అందజేశారు. బ్యాండు మేళాలతో భక్తి శ్రద్దలతో ఊరేగింపుగా వెళ్ళి అక్షింతలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆకుల మహేష్, క్రాంతి కుమార్, మూల రవిందర్, శ్రీనువాస్ రెడ్డి, సుమన్‌కుమార్, కుషల్ కుమార్, అనురాధ, సురేందర్, మురళి పాల్గొన్నారు.

## పురస్కారాలు ప్రదానం



నాంపల్లి, జనవరి 7 ప్రభాతవార్త : ఉభయ తెలుగురాష్ట్రాలలో తెలుగుభాష, సాహిత్యాలకు అందిస్తున్న విశేషసేవలకు గుర్తింపుగా తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షుడు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డికి, ప్రధాన కార్యదర్శి డా. జుర్రు చెన్నయ్యలకు పూర్ణకుంభ తెలుగు వెలుగు పురస్కారాలు లభించాయి. డా. గజల్ శ్రీనివాస్ అధ్యక్షతన గల ఆంధ్ర సారస్వత పరిషత్తు, చైతన్య విద్యా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో 5, 6, 7 తేదీల్లో అంగరంగ వైభవంగా జరుగుతున్న రెండవ అంతర్జాతీయ తెలుగు మహాసభల వేదికపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్, పద్మభూషణ్ డా. యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, చైతన్య రాజు, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ తదితరులతో కలిసి డా. జుర్రు చెన్నయ్యను సత్కరించారు.

**కులవృత్తిదారులకు కేంద్ర పథకాలను**

## సద్వినియోగం చేసుకోవాలి: పిట్ల నాగేశ్

కంటోన్మెంట్, జనవరి 7 ప్రభాతవార్త: ప్రధాన మంత్రి విశ్వకర్మ కౌషల్ సమ్మాన్ యువజన పథకం ద్వారా కుల వృత్తిదారులకు కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని బిజెపి ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పిట్ల నాగేశ్ ముదిరాజ్‌లు తెలిపారు. ఆదివారం మారేడ్‌పల్లిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నాగేశ్ మాట్లాడుతూ వడ్రంగి, కమ్మరి, స్వర్ణకారులు, కుమ్మరి, శిల్పి, శర్మకారులు, చెప్పులు కుట్టే వారు, నాయిబ్రాహ్మణులు, ధర్జీలు, పూల అల్లికలు,తాళం చెవిలు తయారు చేసే వంటి వివిధ కులవృత్తులపై ఆధారపడే వారికి 15 రోజుల పాటు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చి ప్రశంస పత్రాలు అందజేయడంతో పాటు అర్హులైన లబ్ధిదారులకు లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తుందన్నారు. అర్హులైన లబ్ధిదారులు, ఆసక్తి గల కులవృత్తి దారులు సి.ఎస్.సి కేంద్రంలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పిట్ల నాగేశ్ తెలిపారు.

## ఆరు గ్యారంటిల ప్రజాభిమానం పొందాలి

**సోషలిస్టు పార్టీ ఆఫ్ ఇండియా సూచన**

సైఫాబాద్, జనవరి 7 ప్రభాతవార్త: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటిలను అర్హులైన పేదలకు అందించి, ప్రజల మన్నలను పొందాలని సోషలిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌పిఐ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోద్రమోని పురుషోత్తం చెప్పారు. గత ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కారించకుండా ఒట్టెద్దు పోకడలతో నిరంకుశ పాలన కొనసాగించిందని ఆయన ఆరోపించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసున్న మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాలతో పేదల స్థితిగతులు మారతాయని అశాభావం వ్యక్తం చేశారు. ఈ పథకాల అమలులో ఏలాంటి పైరవీలకు తావులేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి నేరుగా అందించాలని, బ్రోకర్ల ప్రమేయం ఉండరాదని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం చేపట్టే కార్యక్రమాలకు తమ పార్టీ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు ఎర్ర రాజేష్, ఆర్.ఝాన్సీ, బి.సుజాత, బి.భాను ప్రసాద్, ఆర్.రాంచందర్, సంధ్యారాణి, నాగేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులను ఆదుకోవాల్సిన బాధ్యత సమాజంపైన ఉంది



**దివ్యాంగులకు వీల్ ఛైర్స్ పంపిణి చేస్తున్న శ్రీకర్‌శర్మ, రజని**

సైఫాబాద్, జనవరి 7 ప్రభాతవార్త: దివ్యాంగులకు చేయూత నిచ్చి ఆదుకోవాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపైన ఉందని, శ్రీకర సత్య సేవా సహకార సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు, హైకోర్టు న్యాయ వాది నూతి శ్రీకర్‌శర్మ, కాచిగూడ రైల్వే స్టేషన్ సూపర్‌వైజర్ జి.రజని చెప్పారు. దివ్యాంగులను, పేదలను ఆదుకున్నప్పుడే నిజమైన తృప్తి, ఆనందం లభిస్తుం దన్నారు. సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం నాడిక్కడ జగ్గంగూడెం గ్రామానికి చెందిన ఇద్దరు దివ్యాంగులకు వీల్ ఛైర్స్ ఉచితంగా పంపిణి చేసిన సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతి నిత్యం దేశంలో ఆనేక మంది రోడ్డు ప్రమాదాలలో గాయపడుతున్నారని, మరికొంత మంది రోగాల బారిన పడి దివ్యాంగులుగా మారుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారిని మానవతా దృక్పథంతో మనం ఆదుకోవడం మానవ ధర్మం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య సభ్యులు మనిగండ్ల శ్రీనివాస్‌గుప్తా, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో శారీరక ధృడత్వం పెంపొందించుకోవచ్చు




బేగంపేట జనవరి 7,ప్రభాతవార్త : క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక ధృడత్వం పెంపొందించుకో వచ్చుని,ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా సౌత్ రీజినల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌జీ ఫణిక్కర్ అన్నారు.ఆలిండియా ఎయిర్‌పోర్ట్స్ ఆథారిటీ ఆఫ్ ఇండియా ఇంటర్ జోనల్ క్రికెట్ టోర్నమెంట్ 2023.2024ముగింపు వేడుకలు ఆదివారం బేగంపేట ఎయిర్ పోర్ట్ కాన్ఫరెన్స్‌హాలులో జరిగాయి.ఈ టోర్నమెంట్‌లో విజేతలైన సెంట్రల్ జోన్ టీమ్, రన్నరప్ గా నిల్చిన వెస్ట్‌జోన్ టీములకు ట్రోఫీలను అందించడంతో పాటు టోర్నమెంట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో బేగంపేట ఎయిర్ పోర్ట్ (సీఐసీ')జిఎం హజారీ,సదరన్ రీజియన్ స్పోర్ట్స్ కంట్రోలు బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన 25వ సమన్వయ్




పేట్ బషీరాబాద్, జనవరి 7, ప్రభాతవార్త: శివ శివాని ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్లో రెండు రోజుల పాటు జరిగిన 25వ సమన్వయ్ వేడుకలు శనివారం ఘనంగా ముగిసాయి. ఈ మేనేజ్మెంట్ ఫెస్ట్లో 1500మంది విద్యార్థులు పలు రాష్ట్రాల కళాశాలల నుండి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మేనేజింగ్ పార్ట్నర్ జివి మాల్ కె.సుమంత్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను చదువుకున్న కళాశాలకు ముఖ్య అతిథిగా రావటం గర్వకారణం అని అన్నారు. తాను తన చదువుకున్న రోజులను నెమరువేసుకున్నారు. ఈ సమన్వయ యొక్క ముఖ్య ఉద్దేశాన్ని ఆయన వివరించారు. ఈ సమన్వయ్ (మేనేజ్మెంట్ ఫెస్ట్) ముఖ్య ఉద్దేశ్యం విద్యార్థుల్లో నిర్వహణ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, సమన్వయం మొదలగునవి నేర్చుకునే అవకాశం ఈ మేనేజ్మెంట్ ఫెస్ట్ ఎంతగానో ఉపయోగడతాయన్నారు. అంతేకాకుండా పాల్గొన్న విద్యార్థులకు ప్రోత్సాహక పత్రాన్ని అందజేశారు. వివిధ సాంస్రృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో శివ శివాని విద్యసంస్థ ప్రెసిడెంట్ ఆర్తి సంపతి, వైస్ ప్రెసిడెంట్ దీపికా సంపతి, డైరెక్టర్ డా.ఎస్వీ.రమణారావు, సమన్వయ్ కో ఆర్డినేటర్లు డా.కె.ఎస్ హారీష్, డా.జయలక్ష్మీ, డా.అరిజిత్ శాంతికరీ, డా.అన్నపూర్ణ, స్టూడెంట్ కో ఆర్డినేటర్ సాయిచరణ్, విద్యార్థులు బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా స్కూల్ ప్రథమ వార్షికోత్సవం



జీడిమెట్ల, జనవరి 7, ప్రభాతవార్త : బాచుపల్లి లోని పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ వారు ప్రథమ వార్సికోత్సవాన్ని పాఠశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సంస్థ డైరెక్టర్ సుశీల్ కుమార్, అకాడమిక్ డైరెక్టర్ సుధామాధురి, రాధాసింగ్, రాజమౌళి, శ్రావణి, తనూజ, వనజ, ప్రముఖ నటీమణులు గీతాభాస్కర్, పూనమ్కౌర్లు పాల్గొన్నారు. ప్రిన్సిపల్ అనురాధ మాట్లాడుతూ పల్లవి కేంబ్రిడ్జీ స్కూల్ వారు విద్యార్థుల అభివృద్ధికి ఉపయోపడే పలు సౌకర్యాలతో కూడిన క్రీడా ప్రాంగణాలు, మ్యాథ్స్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్లను రూపొందించడం జరిగిందన్నారు. విద్యార్థులు ప్రనతి అడుగు ఒక మైలురాయి వంటిదని వారు ప్రతి సాంస్రృతిక కార్యక్రమాలతో పాటు ఆల్ ఇండియా స్థాయిలో నిర్వహించే వివిధ పోటీ పరీక్షలలో పాల్గొని తమ సత్తాను చాటుకున్నారని అన్నారు. డా.రాజమౌళి సంస్థ డైరెక్టర్ సుశీల్కుమార్, యషశ్వి మల్హా, అమర్శెట్టి ఎడ్యుకేషన్ పాలసీ అండ్ లా 2020 బ్రుకిట్ ద్వారా పుస్తకాన్ని రూపొందించారు. పూనమకౌర్ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు.

## ఆచార్య కొండాలక్ష్మణ్ బాపూజీ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

చిక్కడపల్లి, జనవరి 7 ప్రభాతవార్త: పద్మశాలి ప్రజాసంఘం ముషీరాబాద్ ఆధ్వర్యంలో ఆచార్య కొండాలక్ష్మణ్ బాపూజీ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం అశోక్నగర్ చౌరస్తాలోని ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద జరిగింది. ముఖ్యఅతిథులుగా గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్, బిజెవైఎం పూర్వ జిల్లా అధ్యక్షుడు, బిఆర్ఎస్ రాష్ట్ర యువనేత ముఠాజైసింహా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుర్రం శంకర్ హాజరై ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తలకొక్కుల సంజీవ్కుమార్, బింగి నవీన్కుమార్, కార్యదర్శి పున్న సత్యనారాయణ, కోశాధికారి మల్లికార్జున శివకుమార్, చేనేతవర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిక్కా దేవదాస్, గణపతి దేవాలయం మాజీ చైర్మన్ జయర్, డాక్టర్ రూప, నాయకులు బొట్టు శ్రీనివాస్, చింతకింది నవీన్, వంశీ, బల్లా ప్రశాంత్, ఎం.భాస్కర్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు నియంత్రణ, విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలి

**బిసి విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షుడు విక్రం గౌడ్**

అల్వాల్, జనవరి 7 ప్రభాతవార్త: దేశంలో అసమానతలు లేని విద్యా వ్యవస్థ అత్యవసరం అని బిసి విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షుడు విక్రం గౌడ్ తెలిపారు. ఆదివారం అల్వాల్ రామచంద్రనగర్ కాలనీ కమ్యూనిటీ హాల్లో అంబేద్కర్ యువజన సంఘం నాయకులు భరత్ నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. విద్యను జాతీయ చేయడం ప్రతి ఒక్కరూ చదువుకునే విధంగా చర్యలు చేపట్టడం ప్రభుత్వాల తక్షణ కర్తవ్యమని తెలిపారు. విద్యను వ్యాపారం దృక్పధంతో చూడడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బిసి వర్గాలు ప్రజలకు అందని ద్రాక్ష పండుగా మారిందని తెలిపారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం కొలువు తీరిన నేపథ్యంలో కఠిన చట్టాలు అవసరమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆకాష్, యశ్వంత్, మహేష్, మనోజ్, కిరణ్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

## 10 సంవత్సరాల ప్రభుత్వ పాలనలో విద్యావ్యవస్థ నిర్వీర్యమైంది

**టిఎస్పిఎస్సి పూర్వ చైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి**




చిక్కడపల్లి, జనవరి 7 ప్రభాతవార్త: రాష్ట్రంలో గతంలో 10 సంవత్సరాల పాటు అధికారంలో ఉన్న ప్రభుత్వం విద్యావ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిందని టిఎస్పిఎస్సి పూర్వ చైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆదివారం బాగ్లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ధర్మ టీచర్స్ యూనియన్(డిటియు) ఆవిర్భావ సభ యూనియన్ ప్రతినిధి కొండ ఆశన్న అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ కేజీ నుంచి పీజీ వరకు ఉచిత నిర్బంధ విద్య పేరుతో అధికారంలోకి వచ్చిన తర్వాత 10 సంవత్సరాల పాటు ఆ దిశలో అడుగులు వేయలేకపోయిందని, దీంతో విద్య ఆ వర్గాలకు విద్య అందనిద్రాక్షలా మారిందని అన్నారు. తెలంగాణ పునర్నిర్మాణంలో విద్యావ్యవస్థతో ముడిపడి ఉందని, ఇందుకు ఉపాధ్యాయులందరు కూడా ఈ రంగం అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఉపాధ్యాయులందరు విద్యాపరమైన అంశాలపై సామాజిక స్పృహతో ఐక్యంగా ముందుకు రావాలని అన్నారు. జ్ఞానాన్ని అందించే ప్రతినిధులుగా ఉపాధ్యాయులు ఉండాలని, కాని ప్రస్తుతం అటువంటి సామాజికి స్పృహ, చైతన్యం లేనిలోటు కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విశారదన్ మహారాజ్, ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ రామయ్య యాదవ్, సౌద అరుణ, లింగమయ్య యాదవ్, ఉమ్మడి జిల్లాల ఇంచార్జ్లు దామెర ఉపేందర్, నాగరాణి, ఎన్.రమేశ్, పి.అశోక్, కె.రాజు, రవిచంద్రన్, బి.రవి, సుధాకర్, జనార్దన్, 33 జిల్లాల డిటియు ఇంచార్జ్లు పాల్గొన్నారు.

## ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధి: ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



అల్వాల్, జనవరి 7 ప్రభాతవార్త: అభివృద్ధిని నిరంతరాయంగా ముందుకు తీసుకుని వెళతామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. ఆదివారం మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని హెచ్ఎంటి ఆఫీసర్స్ కాలనీ, చిన్ననతోట, ఫాదర్ బాలయ్యనగర్, ఓం శ్రీ సాయినగర్ తదితర ప్రాంతాలులో ఎమ్మెల్యే పర్యటించారు. డ్రైనేజీ, పారిశుధ్యం, రోడ్లు తదితర సమస్యలను కాలనీ వాసులు ప్రధానంగా ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. సంబంధిత శాఖల అధికారులుతో చర్చించి సమస్యలు అన్నింటిని పరిష్కరిస్తామని మర్రి హామీ ఇచ్చారు. అభివృద్ధి పనులు టెండర్లు పూర్తి చేసిన వాటిపై ప్రత్యేక దృష్టి పెడతామని స్పష్టం చేశారు. దశల వారీగా సమస్యలు అన్ని పరిష్కారం అవుతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డోలి రమేష్, పరమేష్, పవన్ కుమార్ ఇతర నేతలు పాల్గొన్నారు.

## అయ్యప్ప పడి పూజలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి



అల్వాల్, జనవరి 7 ప్రభాతవార్త: మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అయ్యప్ప పడి పూజకు హాజరయ్యారు. మచ్చబొల్లారం సూర్య నగర్లో శ్రీనివాస్ గౌడ్ స్వామి పడి పూజను చేపట్టారు. చిన్నారి బేబీ అయ్యప్ప స్వామిపై పాడిన పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మైనంపల్లి సైతం చిన్నారి నైపుణ్యానికి అభినందనలు తెలిపారు. పడి పూజకు పెద్ద సంఖ్యలో స్వాములు హాజరయ్యారు.

## చైతన్య విలాస్ కాలనీలో శ్రీ రాముడి అక్షింతల వితరణ



మైలార్దేవ్పల్లి, జనవరి 7 ప్రభాతవార్త : హైందవుల ఆరాధ్య దైవం శ్రీ రాముల అక్షింతలు ఆదివారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఉప్పర్ పల్లిలో గల చైతన్య విలాస్ కాలనీలో ఇంటింటికి చేరాయి. కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు మురళీ, మహేష్, రాజ్కుమార్ల ఆధ్వర్యంలో విశ్వ హిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్, హైందవ ప్రతినిధులు ఇంటింటికి పర్యటించి శ్రీ రాముల వారి అక్షింతలను ప్రజలకు అ ందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా ప్రతినిధులు లత, స్వప్న, కనకదుర్గ, జ్యోతి, జయ, అరుంధతి, విజయ భారతి, శాంతి లాల్ జోషీ, అనీష్, సుభాష్లు పాల్గొన్నారు.

## అక్షిత పూజల్లో పాల్గొన్న భజరంగ్సేనా ప్రతినిధి



బేగంబజార్, జనవరి 7ప్రభాతవార్త: అయోధ్య రామ జన్మభూమిలో రామమందిరం ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ భజరంగ్సేనా ఆధ్వర్యంలో అక్షితలు పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల 22వ తేదిన అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేయడం జరుగుతుందని తెలంగాణ భజరంగ్సేనా అధ్యక్షులు ఎస్.ఆర్.లక్ష్మన్రావుగుప్త తెలిపారు.

## సగరులను బిసి'ఎ'లోకి మార్చాలి

**రాష్ట్ర సగర సంఘం అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర**



మణికొండలో సగర సంఘం 2024 క్యాలెండర్ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర సగర సంఘం అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర తదితరులు

నార్సింగి, జనవరి 7 ప్రభాతవార్త : విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాలలో వెనుబడిన సగరులు వృద్దిలోకి రావాలంటే బిసిడి నుంచి బిసి'ఎ'లోకి సగరులను మార్చాలని సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర పేర్కొన్నారు. ఆదివారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలో అధ్యక్షులు దేవేందర్ సగర ఆధ్వర్యంలో సగర సంఘం 2024.క్యాలెండర్ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శేఖర్ సగర మాట్లాడుతూ సామాజిక చైతన్యం లేకపోవడంతో సగరులు ఆర్థికంగా, రాజకీయంగా రాణించలేకపోయారన్నారు. భారత రాజ్యాంగ మౌళిక సూనరతాలను పరిగణనలోకి తీసుకొని ఆర్థికంగా అత్యంత వెనుబడి ఉన్న సగర కులాన్ని బిసి'ఎ'లోకి చేర్చాలని డిమాండ్ చేశారు. బిసిడిలో ఉండడం వలన రిజర్వేషన్లు లేక సగరులు విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగంలో వెనుకబడిపోయార న్నారు. సమ సమాజ నిర్మాణమే లక్ష్యమంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చే రాజకీయ నాయకులు సగరులకు న్యాయం జరుగలాంటే బిసిఎలుగా మార్చాలని కోరారు. కర్నాటక, మహారాష్ట్ర, ఒరిస్సా రాష్ట్రాలలో వలే తెలుగు రాష్ట్రాలలో సైతం సగరులను బిసిఎలోకి మార్చి ఆదుకోవాలన్నారు. సగరులకు జరుగుతున్న అన్యాయంపై అన్ని రాజకీయ పార్టీలు స్పందించి, న్యాయం చేసేంత వరకు సగర సంఘం ఉద్యమాలు చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు బంగారు నరసింహ, ఉపాధ్యక్షులు రాంచంద్రయ్య, గ్రేటర్ యువజన సంఘం అధ్యక్షులు సీతారాం, గౌరవ అధ్యక్షులు మహాదేవ, వెంకటేశ్వర్లు, సలహాదారులు అశోక్, వెంకటేష్, ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, సంయుక్త కార్యదర్శి వెంకటేష్, కోశాధికారి గోపి, మహిళా సంఘం అధ్యక్షురాలు రోజ, ప్రధాన కార్యదర్శి సునీత పాల్గొన్నారు.

## ఇంటింటికి తిరిగి శ్రీరాముడి అక్షింతలు పంపిణీ చేసిన భక్తులు

నార్సింగి, జనవరి 7 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని హైదర్షాకోట్లో హిందువుల ఆరాధ్య దైవమైన శ్రీరాముడి అక్షింతలను భక్తజనులు ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. పుర వీధులలో జైశ్రీరాం... జైజై శ్రీరాం... రామ లక్ష్మణ జానకీ... జైబోలో హనుమాన్కి... అంటూ నినాదాలు చేస్తూ గడప గడపకు అయోధ్య రాముడి అక్షింతలను చేరవేస్తున్నారు. భక్తులు కాషాయం దుస్తులు ధరించి పంగలా అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పిల్లలు, మహిళలు, వృద్దులు, పెద్దలంతా కలిసి కట్టుగా ఇంటింటికి తిరిగి భక్తితో రామయ్య అక్షింతలను పంపిణీ చేశారు. అక్షింతలు తీసుకున్న ప్రజలు రామయ్య ప్రసాదం మన ఇంటికి వచ్చిందంటూ మురిసిపోతున్నారు. అక్షింతలను తమ ఇంట్లో దేవుడి గుడి వద్ద ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఐదు దశాబ్దాల తరువాత బాల రాముడు తన జన్మస్థానమైన అయోధ్యలో కొలువు తీరుతుండడం శుభ పరిణామమని, ఇక దేశమంతా రామనామ స్మరణంతో పునీతమవుతుందన్నారు. ఎక్కడ రామ నామం ఉంటుందో అక్కడ చెడు దూరంగా వెళ్తుందని పుర ప్రముఖులు స్పష్టం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భక్తజనులు చేవెళ్ల నవీన్రెడ్డి, శరత్, కాంత్రెడ్డి, జనార్ధన్రెడ్డి, అఖిలేష్రెడ్డి, ప్రియాంక, రాజేశ్వర్, లలిత, అనూష, రమ్య తదితరులు పాల్గొన్నారు.




హైదర్షాకోట్లో ఇంటింటికి తిరిగి శ్రీరాముడు అక్షింతలను పంపిణీ చేస్తున్న భక్తులు

## వచ్చే నెల 14న శ్రీ ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్టాపనకు ఏర్పాట్లకు సిద్ధం : జంపనప్రతాప్



1వ వార్డు బాపూజీ నగర్ శ్రీ ముత్యాలమ్మ దేవాలయంను సందర్శించిన వేణు మాధవ శర్మ, జంపనప్రతాప్ తదితరులు

కంటోన్మెంట్, జనవరి 7 ప్రభాతవార్త: కంటోన్మెంట్ 1వ వార్డు బాపూజీ నగర్లో ప్రసిద్ధిగాంచిన శ్రీ ముత్యాలమ్మ దేవాలయం పునర్ నిర్మాణం వచ్చే నెల 14న ఉదయం 10 గంటలకు విగ్రహ ప్రతిష్టాపన ముహూర్తం చేయాలని సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాళి ఆలయ ప్రధాన అర్చకులు వేణు మాధవ శర్మ తెలిపారు. ఆదివారం పూజీ నగర్లో కొనసాగుతున్న శ్రీ ముత్యాలమ్మ దేవాలయం పునర్ నిర్మాణం పనులను కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, అర్చకులు సంతోష్ శర్మలతో కలిసి పర్యవేక్షించారు. ఆలయ ప్రాంగణంలో విగ్రహ ప్రతిష్టాపన ఎక్కడ ఏర్పాటు చేయాలి, ఆలయ ముఖ ద్వారం, ద్వాజ స్థంబం ఎక్కడ ఏర్పాటు చేయాలని ఆలయ నిర్వాహకులకు సూచించారు. వచ్చే నెల 14న ఉదయం 11 గంటల 15 నిమిషాలకు జరిగే విగ్రహ ప్రతిష్టాపన వేడుకలను బారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేయాలని నిర్వాహకులకు ఎసూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు దుర్గయ్య, అజిత్ కళ్యాణ్, ప్రేమ్ ముదిరాజ్, బండారి లక్ష్మణ్, బట్టు కొమురయ్య, కాంపాల్లి శ్రీకాంత్, మల్లేశ్, ధనుంజయ గౌడ్, నరేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## రెండురోజుల పాటు జరిగిన సౌంత్ ఇండియా రోబోటిక్స్ ఈవెంట్




నిజాంపేట్, జనవరి 7, ప్రభాతవార్త : బాచుపల్లి విఆర్ఎస్ విజ్ఞాన జ్యోతి పాఠశాలలో రెండు రోజుల పాటు జరిగిన సౌత్ ఇండియా రోబోటిక్స్ ఈవెంట్కు విఎన్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిడి నాయుడు, విఆర్ఎస్ విజ్ఞాన జ్యోతి స్కూల్ డైరెక్టర్ కొడాలి విజయరాణిలు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. విఆర్ఎస్ విజ్ఞాన జ్యోతి స్కూల్ ఐటీ హెడ్ ప్రత్తిపాటి నృపాల్ చైదరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ ఈవెంట్లో విజేతలు, రన్నర్లను ట్రోఫీలు, రూ.8000, రూ.5000 నగదు బహుమతులను అందజేశారు. విఆర్ఎస్ విజ్ఞాన జ్యోతి స్కూల్ విద్యార్థులు లైన్ ఫాలోవర్ ఛాలెంజ్లో విజయం సాధించడం, ఇన్నోవేషన్, కోడింగ్ ఛాలెంజ్లలో రన్నర్ ఆఫ్ స్థానాలను సాధించారు. ఇన్నోవేషన్ ఛాలెంజ్, సాకర్ రోబోట్ ఛాలెంజ్లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్, ఒయాసిస్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ విజేతలుగా నిలిచాయి. లైన్ ఫాలోవర్ ఛాలెంజ్, సాకర్ రోబోట్ ఛాలెంజ్లో సెయింట్ రీటా హైస్కూల్ మియాపూర్, శాంటినోస్ గ్లోబల్ స్కూల్ రన్నర్లుగా నిలిచారు. విద్యార్థులు అక్కడికక్కడే ప్రశ్నలకు సమాధానమిచ్చినందుకు బహుమతులు పొందడం ద్వారా వారి సహజత్వానికి రివార్డ్ చేయబడింది. రోబోటిక్స్ విద్యా రంగంలో ఆవిష్కరణ, సృజనాత్మకత, శ్రేష్టతను పెంపొందించడానికి ఈ ఈవెంట్ నిదర్శనంగా నిలుస్తుంది.

## విద్యతోనే సమాజంలో సముచితం స్థానం




కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్.పాలంకి సత్య దత్తాత్రేయ, అగర్వాల్ శిక్షా సమితి చైర్మన్ ప్రమోద్ కుమార్ కేడియో, డాక్టర్ మోహన్ గుప్తా

చార్మినార్, జనవరి 7 ప్రభాతవార్త : విద్యతోనే సమాజంలో గౌరవం లభించటంతో పాటు మంచి గుర్తింపు వస్తుందని, ప్రతీ వ్యక్తి చదువుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని రెనోవా గ్రూప్ ఆఫ్ హాస్పటిల్స్, చీఫ్ ఆఫ్ మెడికల్ అంకాలజీ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్.పాలంకి దత్తాత్రేయ అన్నారు. హైదరాబాద్ పాతబస్తీ చార్కమాన్లోని అగర్వాల్ శిక్షా సమితిలో ఆదివారం రెనోవా గ్రూప్ ఆఫ్ హాస్పటిల్స్, అగర్వాల్ శిక్షా సమితిల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్.పాలంకి సత్య దత్తాత్రేయ మాట్లాడుతూ పాతబస్తీలో విద్యార్థులకు విద్యను అందిస్తున్నందుకు అగర్వాల్ శిక్షా సమితిని అభినంధిస్తున్నానని తెలిపారు. రెనోవా హాస్పటిల్స్ సిఒఒ రవీంద్రనాధ్ మాట్లాడుతూ ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటుకు సహకారం అందించిన అగర్వాల్ శిక్షా సమితికి కృతజ్ఞతలు తెలియజేశారు. వైద్య శిబిరంలో డాక్టర్లు సాధారణ వైద్య పరీక్షలతో పాటు గుండెకు స ంబంధించిన 2డిఎకో, ఈసిజి, బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ ఉచిత మెగా వైద్య శిబిరంలో అగర్వాల్ శిక్షా సమితి చైర్మన్ ప్రమోద్ కుమార్ కేడియో, సమితి ప్రతినిధులు డాక్టర్.మోహన్ గుప్తా, సి.ఎ.నవీన్ కుమార్ అగర్వాల్, వైద్యులు పాలంకి సత్య దత్తాత్రేయ, నమ్రత శర్మ, యుగంధర్ శర్మ, రాఘవ సునీల్, మహ్మద్ ఆరిఫ్ హుస్సేన్, గాయత్రి, సూర్య ప్రకాష్, మధులత, నవీన్రెడ్డి, దివ్య కిరణ్తో పాటు పలువురు పాల్గొన్నారు.



సికింద్రాబాద్ బోయిన్పల్లిలోని శ్రీమతి సావిత్రిబాయి పూలే 193వ జయంతి సందర్భంగా టీచర్స్ని సన్మానించిన మంత్రి ధనశ్రీ అనుసూయ(సీతక్క)

పారిశుధ్య కార్మికుల కష్టానికి

## ప్రతిఫలమే జాతీయ అవార్డు గుర్తింపు

**డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్రెడ్డి**



తార్నాక, జనవరి 7 ప్రభాతవార్త: పారుశుధ్య కార్మికుల కష్టానికి ప్రతిఫలమే జాతీయ అవార్డు గుర్తింపు లభించిందని నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం తార్నాకలో డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్రెడ్డి మాట్లాడుతూ జీహెచ్ఎంసీకి ప్రతియేట స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు వస్తుందని దానికి కారణం సిబ్బందితో పాటు పారుశుద్ధ కార్మికులు కష్టపడి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడం తోనే మరో సారి ఈ జాతీయ అవార్డుకు ఎంఎక అయ్యిందన్నారు. ఈ సందర్భంగా సానిటేషన్ సిబ్బంది, అధికారులకు శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు చెప్పారు.

## స్పీకర్ను కలిసిన టిఎన్జీఓస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా ప్రతినిధులు

అఫ్జల్గంజ్, జనవరి 7 ప్రభాతవార్త : టిఎన్జీఓస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డా.ఎస్.ఎం. హుస్సేనీ (ముజీబ్) ఆదివారం తెలంగాణ రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ను మర్యాద పూర్వకంగా కలిశారు. జనవరి నెల 24వ తేదీన నిర్వహించనున్న 2024 కొత్త సంవత్సరం డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనాలని కోరుతూ ఆహ్వాన పత్రిక అందజేయడటం జరిగిందని ఎస్.ఎం.హుస్సేనీ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు ఉమర్ ఖాన్, కె.శ్రీనివాస్, ఖాలీద్ అహ్మద్, వైదిక్ శాస్త్రి, ముస్తాఫా షరీఫ్తో పాటు పలువురు పాల్గొన్నారు.

**IN THE COURT OF THE HON'BLE X JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT HYDERABAD**
**O.S.No.61 of 2024**

Between:
**1. Smt. Valiveti Mani MahaLaxmi,** W/o Late Sri.ValivetiVenkata Naga Kishore, Aged about 46 years, Occ: Pvt. School Teacher, R/o Flat No-806, B-Block, ShilpasRvDharmista, Opp D Mart, Miyapur, K.v.Rangareddy, Telangana - 500049
**2. Master Tata Hari Naga Pranav,** Aged about 13 years, Occ : Student Rep. by his mother and natural guardian Smt.Valiveti Mani MahaLaxmi, W/o Late Sri.ValivetiVenkata Naga Kishore, Aged about 46 years, Occ: Pvt. School Teacher, R/o Flat No-806, B-Block, Shilpas Rv Dharmista, Opp D Mart, Miyapur, K.v.Rangareddy, Telangana - 500049 **...Plaintiffs**

AND

**1. HDFC Limited,** Rep. by its Regional Business Head - AP & Telangana, HDFC House, 3-6-310, Hyderguda Road, Basheer Bagh, Hyderabad - 500029.
**2. To Whom So Ever It May Concern**
**...Defendants**

Please take notice that the Plaintiffs have filed the suit for declaration of Legal Heirs of Late Sri. V V N Kishore died on 11-11-2020 with regard to schedule property, the above case is posted on **06.02.2024 at 10:30 AM** for making any objections and counter if any. If no objections are raised the Hon'ble court will proceed with the matter and no objections will be entertained thereafter and the matter will be decided on merits.

**SCHEDULE PROPERTY**

Gratuity and other benefits of the Late Sri V V N Kishore is having in the HDFC Ltd in, Hyderabad.

By the Order of the court

**Sd/- V. ADITYA DATTA**
**Advocate**
R/o Plot No.522, M.K.Plaza, Opp:Ramalayam Temple, HMT Hills, Kukatpally, Hyderabad - 500085

## పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్, బిజెపిలు ఓటమి పాలవడం ఖాయం

**తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు**



కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు పుస్తకాల కవిత

చిక్కడపల్లి, జనవరి 7 ప్రభాతవార్త: అధికారం కోల్పోయామనే అక్కసుతో బిఆర్ఎస్, బిజెపి నేతలు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, వారికి త్వరలోనే ప్రజలు బుద్దిచెప్పే రోజులు ఎంతో దూరంలో లేదని తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు పుస్తకాల కవిత అన్నారు. ఆదివారం నగరంలోని ఇమ్లీబన్, జుబ్లీబస్స్టేషన్, ఇబ్రహింపట్నం బస్స్టేషన్లతో పాటు ఇతర ముఖ్య బస్స్టేషన్లను సందర్శించి మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిన ఉచిత ప్రయాణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కాంగ్రెస్ పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 6 గ్యారెంటీలు పార్టీ అధినేత్రి సోనియాగాంధీ మహిళలకు మహాలక్ష్మి స్కీం కింద ఉచిత బస్సు సౌకర్యం బాగుందని, ఈ పథకాన్ని రాష్ట్ర వ్యాప్తంగా మహిళాలోకం వినియోగించుకుంటోందని, ముఖ్యంగా విద్యార్థినులకు, చిరు వ్యాపారులకు ఎంతో మేలు జరుగుతోందని, ఈ పథకాన్ని కావాలనే బిఆర్ఎస కుట్రలు చేస్తూ రాజకీయాలకు తెరతీస్తోందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకులు కవిత, జయమ్మ, ఉషశ్రీ, తైసీన్ సుల్తానా, జుబ్లిహిల్స్, కవాడీగూడ, రాంగోపాల్పేట అధ్యక్షులు ప్రతీ, కవిత, ఉష అరుణ, బి బ్లాక్ అధ్యక్షురాలు అనూరాధ, జిల్లా కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

**గాంధీనగర్ డివిజన్లో గడపగడపకు కాంగ్రెస్**

గాంధీనగర్డివిజన్లోని వివిధ ప్రాంతాలలో స్థానిక కాంగ్రెస్ నాయకుల ఆధ్వరనయంలో 'గడపగడపకు కాంగ్రెస్' పేరుతో కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గుర్రం చంద్రకళాశంకర్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించిప్రసంగించారు అర్హులైన వారందరికీ ఆరు గ్యారెంటీల పథకాలను వర్తింపచేసేందుకు కృషి చేస్తున్నట్లు, అవసరమైన వారికి దరఖాస్తులు కూడా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులు స్వీకరించే కార్యక్రమానికి ప్రజల ఉంచి విశేష స్పందన లభించిందని, బిఆర్ఎస్ ప్రభుత్వం పేదలను విస్మరించిందని, పేదల ప్రభుత్వమైన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు సంక్షేమ పథకాలను వర్తింపచేసేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుర్రం శంకర్, గాంధీనగర్ డివిజన్ కాంగ్రెస్అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ, పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతోమేలు : ఎమ్మెల్యే రంగారెడ్డి



నందినికి ఎల్.వో.సి కాపీని అందిస్తున్న మల్‌రెడ్డి రంగారెడ్డి

**హయత్‌నగర్, జనవరి 7 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి సహాయనిధి పేద, మధ్య తరగతి ప్రజలకు వరమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ 4వ వార్డు బ్యాంకుకాలనీకి చెందిన బి.శ్రీనివాసరాజు కుమార్తె నందిని పుట్టినప్పటినుంచి మధుమేహంతో బాధ పడుతోంది. ఆమెను తల్లిదండ్రులు నిమ్స్ ఆసుపత్రిలో చేర్పించగా వైద్యానికి రెండు లక్షల రూపాయల వరకు ఖర్చవుతుందని అక్కడి వైద్యులు తెలిపారు. ఆర్థిక పరిస్థితులు బాగోలేని కుటుంబ సభ్యులు సమస్యను మాజీ కౌన్సిలర్ గంట అనుపమ లక్ష్మారెడ్డికి వివరించారు. ఆయన సమస్యను ఎమ్మెల్యే రంగారెడ్డి దృష్టికి తీసుకుపోగా ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి 2 లక్షల రూపాయల ఎల్.వో.సీని మంజూరు చేయించారు. ఈ మేరకు సదరు ఎల్ఓసీ లేఖను ఆదివారం తొర్రూర్‌లోని క్యాంపు కార్యాలయంలో నందినికి అందించారు. కార్యక్రమంలో 23వ వార్డు కౌన్సిలర్ సిద్ధంకి కృష్ణారెడ్డి కాలనీ అధ్యక్షుడు రాకేష్‌గౌడ్, మాజీ వార్డు సభ్యులు సంతోష్‌గౌడ్ పాల్గొన్నారు.

## ఈ నెల 22న దేవాలయాల్లో ప్రత్యేక పూజలు



అక్షితల వితరణ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి, సురేందర్‌రెడ్డి

**మలక్‌పేట, జనవరి 7 ప్రభాతవార్త:** జనవరి 22వ తేదీన అయోధ్యలో శ్రీరాములవారి ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని పురస్కరించుకుని అన్ని దేవాలయలో ఉదయం 11గంటలనుండి భజన, నామ స్మరణ సంకీర్తన తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు మూసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్రం వారి ఆద్వర్యంలో అయోధ్యనుండి వచ్చిన రాములవారి అక్షిత మహా వితరణ కార్యక్రమాన్ని డివిజన్‌లోని శ్రీపురం కాలనీలో మంగళవాయిద్యాల మద్య ప్రజలకు అందజేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనవరి 15వ తేదీవరకు ఇంటింటికి శ్రీరాములవారి అక్షితల పంపిణీతోపాటు అయోధ్య మందిర చిత్రం, ఆహ్వాన పత్రాలను అందజేసు_న్నామని తెలిపారు. ముఖ్యవక్త గా విహెచ్‌పి అధికార ప్రతినిధి రావినూతన శశిధర్ విచ్చేసారు. ఈ కార్యక్ర మంలో కార్యనిర్వాహకులు మోహన్, సందడి సురేందర్‌రెడ్డి, కొండారెడ్డి, దత్తు, మంగళ, శివలక్ష్మి, దుర్గ, భారతి, కొప్పుల దినేష్, సందీప్, సంతోష్, ఉమేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గుల పోటీలో విజేతలకు బహుమతులు

**హైదరాబాద్, జనవరి 7 ప్రభాతవార్త:** పండుగలు సాంప్రదాయానికి చిహ్నం పండుగలు తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయానికి నిదర్శనమని కొత్తపేట, చైతన్యపురి కార్పొరేటర్లు పవన్‌కుమార్, రంగ నరసింహగుప్తా పేర్కొన్నారు. కొత్తపేట డివిజన్ పరిధిలోని న్యూమారుతినగర్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఏర్పాటుచేసిన ముగ్గుల పోటీ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరై ముగ్గుల పోటిలో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండుగలు అందరిలో స్నేహభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు కృష్ణమూర్తి, ప్రభాకర్, వెంకటేష్‌గౌడ్, తిర్మల్‌రెడ్డి, దయానంద్, మురళీధర్, నాయకులు నిరంకి రవి, మహేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ పథకాలు అందేలా కార్యకర్తలు కృషి చేయాలి: కెఎల్ఆర్



కెఎల్ఆర్‌ను కలిసిన బడంగ్‌పేట్ కార్పొరేషన్ నవారు మల్లారెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, జనవరి 7 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం అల్మాస్‌గూడకు చెందిన బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నవారు మల్లారెడ్డి ఆధ్వర్యంలో పలువురు తుక్కుగూడలోని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కెఎల్ఆర్‌ను కలిసారు. ఈ సందర్భంగా ఎన్నికల తర్వాత ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం పని తీరు, ప్రజాపాలన దరఖాస్తుల విషయంలో ప్రజల స్పందన ఎలా ఉందని వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారి ఎంపిక కోసం ప్రభుత్వ అధికారులు విచారణ చేస్తారని వెల్లడించారు. ప్రభుత్వం అమలు చేయనున్న గ్యారంటీ పథకాలు అర్హులకు మాత్రమే అందే విధంగా కాంగ్రెస్ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రామిడి శ్రీనివాస్‌రెడ్డి, కొల్లూరి వంశీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన కార్యక్రమానికి విశేష స్పందన



ఓల్డ్ మలక్‌పేటలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న షేక్ అక్బర్ తదితరులు

**మలక్‌పేట, జనవరి 7 ప్రభాతవార్త:** ప్రజాపాలన కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుందని మలక్‌పేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి షేక్ అక్బర్ పేర్కొన్నారు. ఓల్డ్ మలక్‌పేటలో జరిగిన కార్యక్రమానికి ఆయన విచ్చేసి మాట్లాడుతూ ప్రజా పాలన దరఖాస్తు కేంద్రాలను పరిశీలించి ఏర్పాట్లు, సిబ్బంది పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజలవద్దకు ప్రభుత్వం వచ్చిందని, ప్రజా పాలనలో భాగంగా కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో భాగంగా లబ్దిదారులనుండి దరఖాస్తులను సేకరించడం జరిగిందన్నారు. అర్హులైన వారందరూ స్వచందంగా దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. ఆయా పథకాలకు నిధులు కేటాయించి అర్హులైన లబ్దిదారులకు ప్రభుత్వం పారదర్శకంగా అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాధిక, శ్రీకాంత్, అశ్వాక్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన దరఖాస్తుల డాటా ఎంట్రీ ప్రక్రియను పరిశీలించిన మేయర్ పారిజాత



దరఖాస్తుల డాటా ఎంట్రీని పరిశీలిస్తున్న మేయర్ పారిజాత

**సరూర్‌నగర్, జనవరి 7 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమం సందర్భంగా ప్రజల నుండి వచ్చిన దరఖాస్తుల డాటా ఎంట్రీ నిర్వహణ కోసం నాదర్‌గుల్ కమ్మగూడలోని స్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ఆదివారం మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పరిశీలించారు. ప్రజా పాలన ఇంఛార్జి రాజేశ్వర్‌రెడ్డి, బడంగ్‌పేట్ కమీషనర్ బడుగు సుమన్‌రావు, మేనేజర్ నాగేశ్ బాబు తదితరులతో కలిసి ఆమె కేంద్రాన్ని సందర్శించి డాటా ఎంట్రీ ఆపరేటర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను జాగ్రత్తగా ఎంట్రీ చేయాలని సూచించారు.

## పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అక్షితల వితరణ

**హయత్‌నగర్, జనవరి 7 ప్రభాతవార్త:** అయోధ్య రామజన్మభూమి తీర్థట్రస్ట్ వారి ఆధ్వర్యంలో అందిస్తున్న గడపగడపకు రాముడి అక్షింతల వితరణ కార్యక్రమం ఆదివారం పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ 4వ వార్డు పరిధిలోని శ్రీలక్ష్మీకుటీర్‌లో వైభవంగా జరిగింది. మాజీ కౌన్సిలర్ గంట అనుపమ లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో రామజన్మభూమి నుంచి పంపించిన అక్షింతలను కాలనీలో ఇంటింటికీ అందించారు. శ్రీరామనామ స్మరణతో భజనలు చేసుకుంటూ ఇంటింటికీ తిరుగుతూ అక్షింతలను వితరణ చేశారు.

## నాచారం రెడ్డి సంఘం కేలండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



నాచారం రెడ్డి సంఘం కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**నాచారం, జనవరి 7 ప్రభాతవార్త:** రెడ్డి కులస్థుల అభ్యున్నతి కోసం కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నాచారం రెడ్డి సంఘం కేలండర్‌ను ముఖ్యఅతిధులుగా హాజరైన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే భేతిసుభాష్‌రెడ్డితో పాటు కులస్థులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బిఎల్ఆర్ మాట్లాడుతూ సమిష్టిగా పనిచేస్తూ సమాజ శ్రేయస్సు కోసం తమ వంతు పనిచేయాలని సూచించారు. నాచారం రెడ్డి సంఘం అధ్యక్షులు ఎర్ర శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నమిలి కొండ భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, బిజెపి నాయకులు అంపాల అనిత పద్మారెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షులు పోగుల వెంకటరమణారెడ్డి, కార్య నిర్వాహక అధ్యక్షులు రాగిరి మోహన్‌రెడ్డి, ఇమ్మడి రామచంద్రారెడ్డి, కృష్ణారెడ్డి, రవీందర్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

## నేడు జోనల్ కార్యాలయంలో ప్రజావాణి

**హైదరాబాద్, జనవరి 7 ప్రభాతవార్త:** ఎల్బీనగర్ జోనల్ కార్యాలయం, సర్కిల్ కార్యాలయాలలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పంకజ తెలిపారు. జిహెచ్ఎంసి కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు ఎల్బినగర్ జోనల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తామని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రతి సెక్షన్ సంబంధిత అధికారులు పాల్గొంటారని, ప్రజలందరూ తమ సమస్యలను దరఖాస్తుల ద్వారా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## ఎమ్మెల్యే మల్‌రెడ్డికి నాయకుల సన్మానాలు



ఎమ్మెల్యే రంగారెడ్డిని సన్మానిస్తున్న అనాజ్‌పూర్ గ్రామ నాయకులు తదితరులు

**తుర్కయంజాల్, జనవరి 7 ప్రభాతవార్త:** అనాజ్‌పూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని ఆదివారం ఉదయం క్యాంపు కార్యాలయంలో కలిసి సన్మానించారు. ఇటీవల జరిగిన ఎన్నికలలో అత్యధిక మెజార్టీతో గెలిచిన ఇబ్రహీంపట్నం ముద్దుబిడ్డ ఎమ్మెల్యే రంగారెడ్డిని ఆదివారం తొర్రూరు క్యాంపు కార్యాలయంలో అనాజ్‌పూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు.. ప్రజాప్రతినిధులు.. బూత్ కమిటి సభ్యులు, యువజన కాంగ్రెస్ సభ్యులు పాల్గొని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని సన్మానించారు. అనంతరం రంగారెడ్డికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి ప్రత్యేకంగా కరవాలం బహుకరించారు.

## తొర్రూరు హెచ్ఎండీఏ వెంచర్ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డికి వినతి

**తుర్కయంజాల్, జనవరి 7 ప్రభాతవార్త:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ తొర్రూరులో 117 ఎకరాల్లో హెచ్ఎండీఏ భారీ వెంచర్ ఏర్పాటు చేసింది. ఈ లే అవుట్‌లో ప్లాట్ల అమ్మకం ద్వారా ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.600 కోట్ల పైచిలుకు ఆదాయం చేకూరింది. అందులో నుంచి 10శాతం అంటే రూ.60కోట్లు వెంచర్ అభివృద్ధికి కేటాయించాల్సి ఉంది. నిబంధనల ప్రకారం లేఅవుట్‌లో రహదారులు, భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పైపులైన్లు, విద్యుత్తు సౌకర్యం ఇతరత్రా మౌలిక వసతులన్నీ హెచ్ఎండీఏనే కల్పించాలి. ఇతర పనులన్నీ 18నెలల్లో పూర్తి చేయాల్సి ఉండగా రెండేళ్లు దాటినా హెచ్ఎండీఏ నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో బాధితులు ఆందోళనకు సిద్ధమయ్యారు. ఆదివారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తొర్రూరు హెచ్ఎండీఏ రాక్‌హిల్స్ కౌంటీఅసోసియేషన్ అధ్యక్షుడు కొండ్రు పురుషోత్తం మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందన్న నమ్మకంతో రూ.కోట్లు వెచ్చించి ప్లాట్లు కొన్నామని, ఇప్పటివరకు ఎలాంటి పనులు చేయకపోవడం దుర్మార్గమన్నారు. ప్లాట్ డబ్బుల చెల్లింపునకు తమకు 90రోజుల గడువు ఇచ్చారని, గడువు దాటినవారి దగ్గర నుంచి 10శాతం అదనపు జరిమానా విధించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు అప్పులు తెచ్చి ప్రభుత్వానికి చెల్లించారన్నారు. కాని ప్రభుత్వం 18నెలల్లో అభివృద్ధి చేయాల్సి ఉన్నా... ఇప్పటివరకు పూర్తి చేయలేదని దీనికి ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం, హెచ్ఎండీఏ అధికారులు స్పందించి లేఅవుట్‌లోని సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అనిల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ఎస్.సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ డీలర్లు అప్రమత్తంగా ఉండాలి : డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్



గ్యాస్ సిలిండర్లను తరలిస్తున్న బండ్లను తనిఖీ చేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్

**సైదాబాద్, జనవరి 7 ప్రభాతవార్త:** గ్యాస్ డీలర్లు, తమ గిడ్డంగులు, స్టాక్ డెలివరీపై కన్నేసి ఉంచాలని లేక పోతే అవకతవకలు, అక్రమాలు జరిగేందుకు అవకాశం ఉందని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసిల్దార్ మాచన రఘునందన్ స్పష్టం చేశారు. ఆదివారం సాగర్ రోడ్డులో గ్యాస్ సిలిండర్లను తరలిస్తున్న పలుబండ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ.. గ్యాస్ డీలర్లు ఎంత ఏమరు పాటుతో ఉంటున్నారన్న విషయం ఇటీవల ఐశ్వర్య గ్యాస్ ఏజెన్సీ నుంచి పెద్ద మొత్తంలో బండలు రీ ఫిల్లింగ్ మాఫియాకు చేరిన సంగతి గుర్తు చేశారు. అందుకే ఆయా గ్యాస్ డీలర్లు ఎప్పటికప్పుడు గిడ్డంగి స్టాక్, సరఫరా వివరాలు తెలుసుకుంటూ ఉండాలన్నారు. చమురు కంపెనీలు గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఏ మాత్రం జాప్యం చేయనప్పటికి, డీలర్ల సరైన పర్యవేక్షణ లేకపోవడంవల్ల కొందరు వినియోగదారులకు గ్యాస్ సకాలంలో చేరడం లేదన్న ఫిర్యాదులు ఉన్నాయన్నారు. వినియోగదారులకు సేవలందించడంలో డీలర్లు విఫలమైతే చర్యలు తీసుకునే అవకాశం కూడా లేకపోలేదన్నారు.

## ఆర్య వైశ్యులకు అన్ని విధాలా సహకారం అందించాం: ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



ఆర్యవైశ్య సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, జనవరి 7 ప్రభాతవార్త:** సామాజిక సేవతో పాటు ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషి చేస్తున్న ఆర్యవైశ్య సంఘాలకు అన్ని విధాల సహాయ సహకారాలు అందించామని ఎమ్మెల్యే పట్లోళ్ళ సబితాఇంద్రారెడ్డి స ్పష్టం చేశారు. మీర్‌పేట్ కార్పొరేషన్ జిల్లెలగూడ స్వాగత్ గ్రాండ్‌లో ఆదివారం బాలాపూర్ మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ సభకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నాళ్ళ శ్రీనివాస్ గుప్త అధ్యక్షతన జరిగిన సభలో సబితారెడ్డి తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ గుప్త, ప్రధాన కార్యదర్శి అర్థం లక్ష్మయ్య గుప్త, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు తాడేపల్లి వెంకటేశం గుప్త, వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు తేరేటిపల్లి శ్రీనివాస్‌గుప్త తదితరులతో కలిసి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ మేయర్ ముదావత్ దుర్గ దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, కార్పొరేటర్ సిద్దాల లావణ్య బీరప్ప, ఆర్యవైశ్య సంఘాలకు చెందిన మురళీధర్ గుప్త, మంచన ప్రేమ్‌కుమార్ గుప్త, ఆంజనేయులు గుప్తతో పాటు ఆర్యవైశ్య కుటుంబాల వారు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ 'వికసిత్ భారత్'తో పేదలకు మేలు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి

**సైదాబాద్, జనవరి 7 ప్రభాతవార్త:** వికసిత్ భారత్ కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలన్ని ఒకే చోట లబ్దిదారులకు అందుబాటులోకి వస్తున్నాయని భాగ్యనగర్ జిల్లా బిజెపి అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. సైదాబాద్ డివిజన్ భూలక్ష్మినగర్‌లో ఆదివారం వికసిత్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వ్యవసాయ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ ఆశా సుతా హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి, నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీ తదితరులు పాల్గొన్నారు.

## నేడు లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

**హైదరాబాద్, జనవరి 7 ప్రభాతవార్త:** సరూర్‌నగర్, ఆర్‌కేపురం డివిజన్ పరిధిలో మంజూరైన కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను సోమవారం మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే, మాజీమంత్రి పి.సబితాఇంద్రారెడ్డి లబ్దిదారులకు పంపిణీ చేస్తారు. సరూర్‌నగర్ మండల తాసిల్దార్ కార్యాలయం ఆవరణలో లబ్దిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉంటుంది.

## విద్యార్థుల రాజకీయ పార్టీ అధ్యక్షునిగా అనికేత్

**హైదరాబాద్, జనవరి 7 ప్రభాతవార్త:** విద్యార్థుల రాజకీయ పార్టీ ఎల్బీనగర్ నియోజకవర్గం అధ్యక్షునిగా అనికేత్ నియామకమయ్యాడు. ఈ మేరకు విద్యార్థుల రాజకీయ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ నియామక పత్రాన్ని అనికేతుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యపై నిరంతరం పోరాటాలు కొనసాగిస్తామన్నారు. విద్యార్థి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు.

## యాదవ మహాసభ రాష్ట్ర యువత ఉపాధ్యక్షుడిగా కిరణ్‌కుమార్‌యాదవ్



కిరణ్‌కుమార్‌యాదవ్‌కు నియామక పత్రం అందజేస్తున్న బాబురావుయాదవ్

**హైదరాబాద్, జనవరి 7 ప్రభాతవార్త:** అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర యువత ఉపాధ్యక్షులుగా నాగోలుకు చెందిన చింతల కిరణ్‌కుమార్‌యాదవ్ నియమితులయ్యారు. నాగోలులోని శుభం కన్వెన్షన్ సెంటరులో ఆదివారం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మహాసభ రాష్ట్ర అధ్యక్షులు బద్ధుల బాబురావుయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ చింతల రవీందర్ యాదవ్ అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన కిరణ్‌కుమార్‌యాదవ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ యాదవుల ఐక్యతకోసం అలుపెరుగని కృషి చేస్తానని, యాదవుల హక్కుల సాధన కోసం ముందుకు సాగుతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువత అధ్యక్షులు అయిలబోయిన రమేష్‌యాదవ్, యువత జాతీయ సమన్వయ కర్త యశ్వంత్‌రాజ్‌యాదవ్ పాల్గొన్నారు.

## మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న ప్రదర్శనలు



మినీ శిల్పారామంలో కూచిపూడి నాట్య ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు

**హైదరాబాద్, జనవరి 7 ప్రభాతవార్త:** ఉప్పల్ మినీ శిల్పారామంలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఇందుమతి ఘంటి శిష్య బృందం ఆధ్వర్యంలో ఆదివారం కూచిపూడి నాట్య ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయక కౌతం, పుష్పాంజలి, ప్రహ్లాద పట్టాభిషేకం, జతి స్వరం, కాలభైరవాష్టకం రామాయణ శబ్దం, దశావతారాలు, అన్నమాచార్య కీర్తనలు అలపించారు. కళాకారులు అవిజ్ఞా, హవిషా, తన్వి, రిషిత, తన్మయ, గీతికా, వర్షిణి, సుభాషిణి, విశిష్ట, దేష్ట, సుమయ, మోక్ష, సహస్ర తదితరులు తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో సందర్శకుల నుంచి మంచి స్పందన ఉందని నిర్వహకులు తెలిపారు.

## వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి




క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దయానంద్‌గుప్తా, శ్రీనివాస్‌గుప్తా

**హైదరాబాద్, జనవరి 7 ప్రభాతవార్త:** వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పర్యాటక శాఖ అభివృద్ధి మాజీ చైర్మన్, ఐవిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. కొత్తపేట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్ మారుతి నగర్ సంక్షేమ సంఘం భవనంలో జరిగిన కార్యక్రమంలో ఆదివారం ఆవిష్కరించి, ఆరోగ్య శిబిరాన్ని ఎమ్మెల్సీ బొగ్గారావు దయానంద్‌గుప్తాతో కలిసి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా ప్రారంభించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజల ఆరోగ్య సంరక్షణకు దోహద పడడం పట్ల అభినందించారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు డాక్టర్ రాజయ్యగుప్త, జనరల్‌సెక్రెటరీ వెంకటేశంగుప్తా, కమిటీ సభ్యులు నేతి రాములు, చీకటిమల్ల అశోక్, సురేందర్‌గుప్తా, ఎల్బీ.కుమార్, రమణయ్య, నరేష్‌గుప్తా, ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

## అల్మాస్‌గూడ ఆర్‌వీఆర్ కాలనీలో మేయర్ పర్యటన

**సరూర్‌నగర్, జనవరి 7 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని అలా ్మస్‌గూడ ఆర్‌వీఆర్ కాలనీలో ఆదివారం మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తన దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, పార్టీ నాయకులు బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, బోయపల్లి వెంకట్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

**బాలాజీనగర్‌లో రోడ్డు పనుల పరిశీలన...** అనంతరం మేయర్ తన స్వంత డివిజన్ 31లోని బాలాజీనగర్ కాలనీలో నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో కాలనీఅధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, శ్యామ్‌సుందర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

## వాసవికాలనీ శ్రీ అష్టలక్ష్మి దేవాలయంలో ఘనంగా ధనుర్మాస వ్రత మహోత్సవం



పూజలు నిర్వహిస్తున్న పండితులు

**హైదరాబాద్, జనవరి 7 ప్రభాతవార్త:** ఆర్కేపురం డివిజన్ వాసవికాలనీలోని శ్రీఅష్టలక్ష్మీ దేవాలయంలో ధనుర్మాస వ్రత మహోత్సవం కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా ఆదివారం అమ్మవారిని గాజులతో అలంకరించారు. డిసెంబర్ 17వ తేదీ నుంచి జనవరి 14వ తేదీ వరకు అష్టలక్ష్మి దేవాలయంలో ధనుర్మాస వ్రత ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా ప్రతిరోజు ఒక ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి హాజరయ్యే భక్తులకు అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తున్నట్లు దేవాలయ కమిటీ తెలిపింది.

## ఉప్పల్‌లో ఇంటింటికి రాముడి అక్షితల వితరణ

**హైదరాబాద్, జనవరి 7 ప్రభాతవార్త:** అయోధ్య రామయ్య పట్టాభిషేక మహోత్సవంలో ఉపయోగించే శ్రీ రాముడి అక్షింతలు ఉప్పల్ అన్నపూర్ణనగర్ కాలనీకి చేరుకున్నాయి. అయోధ్యలోని రామాలయం నిర్మాణం శ్రీకారం చుట్టి కొద్ది రోజుల క్రితమే పూర్తి చేశారు. ప్రధాని మోడీ సహకారంతో అయోధ్య రాముడి అక్షింతలు ఆదివారం చిలుకానగర్ డివిజన్ అన్నపూర్ణనగర్ కాలనీ, రాఘవేంద్రకాలనీలోని పలుప్రాంతాల్లో రాముడి అక్షింతలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కాలనీ సంఘం అధ్యక్షుడు కంచర్ల భరత్‌రెడ్డి, రాఘవేంద్రకాలనీ అధ్యక్షుడు మాద్గుల మోహన్‌రెడ్డి, ఎ.రాజేష్, చుక్కారెడ్డి, శ్రీకాంత్, నర్సింగ్‌రావు, చక్రధర్‌రావు, కృష్ణారెడ్డి, అజయ్‌గుప్త తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాముడి అక్షింతలను భక్తులు తమ పూజ గదిలో భద్రపర్చుకుని అయోధ్యలో రామ మందిరం ప్రాణప్రతిష్ట రోజున కుటుంబ పెద్దల నుంచి ఆశీర్వాదం తీసుకోవాలని పేరొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాలనీ నేతలు పాల్గొన్నారు.

## రాఘవేంద్రనగర్‌లో రామయ్య అక్షింతల పంపిణి

**సరూర్‌నగర్, జనవరి 7 ప్రభాతవార్త:** అయోధ్య నుండి వచ్చిన శ్రీ రాముల వారి అక్షింతలను ఆదివారం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని రాఘవేంద్రనగర్ కాలనీలో ఇంటింటికి పంపిణీ చేశారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ ఆధ్వర్యంలో అక్షింతల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు కృష్ణ, మారుతి, నిరంజన్, భాను, ప్రకాశ్, శివ, శేఖర్, విజయ్, శ్రీను, కొండల్, రఘు, రాజ్‌కుమార్, వేణు గోపాల్, శ్రీనివాస్, అరుణ్ రాథోడ్, పలువురు మహిళలు పాల్గొన్నారు.

## కొత్తపేటలో ఇంటింటికి శ్రీరాముడి అక్షితల పంపిణీ : కార్పొరేటర్ పవన్‌కుమార్

**హైదరాబాద్, జనవరి 7 ప్రభాతవార్త:** అయోధ్య రామాలయ అక్షింతలను కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ పంపిణీ చేశారు. డివిజన్ పరిధిలోని రాజీవ్‌గాంధీనగర్, సత్యనగర్‌కాలనీలో అయోధ్య శ్రీరామచంద్రుడి దివ్య అక్షతలు ఇంటింటికి తిరిగి పంచిపెట్టామని కార్పొరేటర్ తెలిపారు. జనవరి 22 తారికున దివ్య భవ్య రామమందిర ప్రాణప్రతిష్ట సందర్భంగా అందరు సమీప దేవాలయాల లో పూజలు చేయాలని, ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు రాజునాయక్, కిషన్, శుక్లా, రమణ, రవీందర్, రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.